జనరాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచిక - 24 పక్షపత్రిక డిసెంబరు16-31, 2010



## ధాన్యం ఎగుమతులపై ఆంక్షల అంతం

రాష్ట్రంలో, దేశంలో రాజకీయాలకతీతంగా
'వ్యవసాయ సంస్కరణలకు నాంది' పలికిన లోక్‌సత్తా పార్టీ

# మెదక్ జిల్లాలో లోక్‌సత్తా పార్టీ





















అన్ని విషయాలను ఎక్కువ హేతుబద్ధంగా ఆలోచించే మెదడు అన్ని వైపులా పదును వున్న కత్తిలాంటిది. అది వాడే వారినే గాయపరుస్తుంది.

- రవీంద్రనాథ్ టాగూర్

## లోపలి పేజీల్లో...


రైతులు ఏకమైతే ప్రభుత్వాలు కదులుతాయి...5
స్వతంత్ర రైతు సంఘాల సదస్సు....................7
స్వతంత్ర రైతు సంఘాల వేదికలు.................. 8
ముఖ్యమంత్రికి లేఖ........................................ 9
ధాన్యం ఆంక్షల ఎత్తివేత జి.వో.........................10
వరకట్న వ్యతిరేక దినం.................................11
దేశాభివృద్ధికి రైతులకు న్యాయమైన ధరలు....12
రైతుల్ని తక్షణం ఆదుకోండి.......................... 13
రైతు ఘోష పట్టని నేతలు..............................14
సర్వజన సత్తా.................................................15
ఆవిర్భావ లక్ష్య సాధనలో...............................17
రాష్ట్ర మహిళాసత్తా........................................ 19
తరతరాల దళారీల దోపిడీ............................. 21
క్షేత్ర పర్యటనలో.......................................... 23
చట్టాలు చేస్తే మహిళా వేధింపులు తగ్గుతాయా?.. 24
జేపీ నా విద్యార్థిగా గర్వపడతాను................ 25
మీ ప్రేమను గుండెల్లో నింపుకుని................. 27
అంబేడ్కర్ వారసత్వం.................................. 28
నిఘంటువు....................................................29
జిల్లాల సమాచారం.........................................30


# అందరికీ నాణ్యమైన విద్యను అందించటమే జోతిబా ఫూలేకు నివాళి

సంపాదకీయం

మనం ఎన్ని చెప్పినా, ఎన్ని రాయితీల్ని, నినాదాల్ని ఇచ్చినా సమాజంలో పుట్టుకతో వచ్చిన వివక్షలు తొలగవు. ఆ అసమానతలు తొలగి అందరికీ ఎదిగే అవకాశాలు రావటం ఒకే ఒక్క మంత్రం ద్వారా సాధ్యం. అది 'విద్య...విద్య...విద్య' రాజకీయానికి విద్యను కేంద్రబిందువు చేసి అందరికీ నాణ్యమైన విద్యను అందించిన రోజు మాత్రమే మహాత్మా జోతిబా గోవిందరావు ఫూలేకు జయంతి, వర్ధంతి నివాళులర్పించే అర్హత మనకు ఉంటుంది.

భారతదేశంలో సమానత్వం కోసం, ఆడపిల్లలకు చదువు కోసం పోరాడిన మొట్టమొదటి యోధుడు ఫూలే. ఆ కృషిలో ఆయన భార్య సావిత్రీబాయి కూడా అండగా నిలిచింది. ఫూలే కంటే ముందు రాజారామ్మోహన రాయ్ దయానంద సరస్వతి సంఘసంస్కరణల గురించి పోరాడినా కులవివక్ష మీద వారు దృష్టిపెట్టలేదు. కులాలకతీతంగా సమాజాన్ని కలపాలని ఫూలే చేసిన కృషి ఆ తర్వాత నారాయణ గురు, బాబాసాహెబ్ అంబేద్కర్, గాంధీజీ, రామస్వామి నాయకర్ ఇలా ఈవేళ మనం మహనీయులుగా చెప్పుకుంటున్నవారెందరికో స్ఫూర్తినిచ్చింది. ఫూలే దేవుడ్ని మానవాతీత శక్తిగానే నమ్మాడు తప్ప కులాలకు, మతానికి ముడిపెట్టలేదు.

ఈవేళ రాజకీయం ఫూలే మార్గానికి తూట్లు పొడుస్తూ పేదలకు నాణ్యమైన విద్యను అందనిద్రాక్షగా మారుస్తోంది. ప్రభుత్వ స్కూళ్లకి పంపితే సరైన చదువు, బతుకు తెరువు వస్తుందన్న నమ్మకం ప్రజలకు లేదు.. తమ పిల్లలు చదువుకుని, తలెత్తుకుని ఆత్మగౌరవంతో బతకాలన్న ఒకే ఒక్క ఆశతో జీవిస్తున్న కూలీలు, బక్కరైతుల చిన్న కోర్కెను కూడా సాకారం చేయలేని దౌర్భాగ్య స్థితిలో వ్యవస్థ ఉంది. ఇది పేదరికం వల్ల వచ్చిన పరిస్థితి కాదు. ఇందుకు రాజకీయమే పూర్తి బాధ్యత వహించాలి. మనకంటే పేద దేశాలైన టాంజానియా, రువాండాలలో కూడా మెరుగైన విద్యనందిస్తున్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నుల డబ్బులో 90శాతాన్ని దోపిడీ చేసి, మిగిలిన పదిశాతాన్ని గొప్ప దానంలా పంచితే పేదరికం పోదు. "పనిమనిషి, డ్రైవర్, కూలీ ఎవరి పిల్లలకైనా నాణ్యమైన విద్యను అందించటం రాజకీయానికి కేంద్రబిందువయ్యే రోజును తీసుకురావటమే జోతిబా ఫూలేకు నిజమైన నివాళి. ఒకవేళ ఆ రోజు రాకపోతే పార్టీలు, ప్రాంతాలతో సంబంధం లేకుండా ఈ దేశంలో తీవ్రమైన హింస, విధ్వంసం చెలరేగి ఊహించలేనంత వినాశం జరుగుతుంది".

**అవధులు దాటితే ఓర్పే పిరికితనం అన్పించుకుంటుంది** – గాంధీజీ

# లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

డిశంబరు 16-31, 2010 సంపుటి - 1 సంచిక - 24

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004


# సూ చీ స్ఫూర్తిగా

పదిహేనేండ్ల కారాగారవాసం చెరగని చిరునవ్వు తన దేశ ప్రజల స్వేచ్ఛ కోసం తన స్వేచ్ఛను పణంగా పెట్టిన త్యాగమయి. సర్వం కోల్పోయినా, చెదరని పట్టుదల. సడలని ధైర్యం. ఇవీ స్థూలంగా సూ చీ పరిచయ వాక్యాలు

త్యాగాలకు అర్థాలు మారుతున్న మనదేశంలో ఆమె త్యాగం అర్థం చేసుకోవడం కొంచెం కష్టమే. గాంధీజీ వారసులుగా మనల్ని ఏలుతున్న నాయకులకు ఆమెకు పోలిక లేదు. మన జాతిపితకు సిసలైన వారసురాలామె. పరదేశీ దాస్యశృంఖలాలకు ఎదురొడ్డిన మన స్వాతంత్ర్య సమరయోధులకు, స్వదేశీ మిలటరీ జుంటా నియంతృత్వ జులుంకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆమెకు ఎన్నో పోలికలు. ఎటొచ్చీ ఇంతటి ఆధునిక కాలంలో గాంధీజీ మానవీయ విలువలకు నిలువెత్తు ఆదర్శంగా ఆమె నిలవటం ఒకింత (సంభ్రమం) ఆశ్చర్యకరం. ఔనా! గాంధీజీ విలువలు, పోరాట పంథా నేటికీ సాధ్యమేనా? అనుకునే వారికి సజీవ సాక్ష్యం ఆమె నిజ జీవితం.

బర్మా స్వాతంత్ర సమరయోధుడు ఆంగ్‌సాన్ గారాల కూతురు నేడు బర్మా ప్రజల పాలిట స్వేచ్ఛా దేవతగా ప్రపంచ ప్రజలకు స్ఫూర్తి ప్రధాతగా నిలవడం వెనుక ఆమె కోల్పోయిన జీవిత సర్వస్వం వుంది. స్వేచ్ఛను పొందగలిగి వుండీ తన దేశ ప్రజల కోసం తన జీవితాన్ని క్షణ క్షణం దుర్భర నిర్భంధానికి బలి చేయడంలో భగత్‌సింగ్ త్యాగం కనిపిస్తుంది. సుభాష్ చంద్రబోస్ నిర్భయత్వం కనిపిస్తుంది. అందరినీ ప్రేమించే భారతీయ ఆత్మ కనిపిస్తుంది.

ఆమె విడుదల తాత్కాలికానందం కారాదని, ఆమె కోరుకున్నట్లుగా బర్మా దేశప్రజలు స్వేచ్ఛగా ప్రజాస్వామ్యపు ఊపిరులు పీల్చాలని మనసారా ఆశిద్దాం.

**- రమేష్**, హైదరాబాద్

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

# రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.


## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు


**మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా**


ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com


## లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**
ఫోటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# రైతులు ఏకమైతే ప్రభుత్వాలు కదులుతాయి: జేపీ

- రైతుల్ని మనుషులనుకుంటున్నారా? రోబోలనుకుంటున్నారా?
- డిమాండ్లకు సాధనకు ఒకే వేదిక మీదకు స్వతంత్ర రైతు సంఘాల ప్రతినిధులు
- రాష్ట్రంలో, దేశంలో రాజకీయాలకతీతంగా ' వ్యవసాయ సంస్కరణలకు నాంది' పలికిన లోక్‌సత్తా పార్టీ

రైతుల్ని ప్రజానీకానికి ఆహారాన్ని, పరిశ్రమలకు ముడిసరకుల్ని ఉత్పత్తి చేసే రోబోట్లుగా మాత్రమే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చూస్తున్నాయి. తమ జీవనోపాధిని పొందుతూ ఆర్థికవ్యవస్థకు తోడ్పాటునిచ్చే రంగంలో ఉన్న మనుషులుగా వారిని పరిగణించటంలేదు.

అన్ని పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించే ప్రభుత్వాలు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ఎందుకు తొక్కిపెడుతున్నాయి. వ్యవసాయోత్పత్తులకు న్యాయమైన, లాభసాటి ధర రాకుండా ఎందుకు చేస్తున్నాయి.

వివిధ పంటల ఉత్పత్తిదారులకు, అనుబంధ కార్యక్రమాల్లో ఉన్నవారికి ప్రాతినిధ్యం వహించే స్వతంత్ర రైతుసంఘాల ప్రతినిధులు తమ లక్ష్యం కోసం, సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఐకమత్యంగా పోరాటానికి మొట్టమొదటిసారిగా ఒకే వేదిక మీదకు వచ్చారు. యెర్నేని నాగేంద్రనాథ్, పి. చెంగల్‌రెడ్డి, నరసింహారెడ్డి, హనుమంతరెడ్డి, చింతల్ వెంకటరెడ్డి, ఎస్.రామచంద్రరావు, నరసింహనాయుడు, మనోహర్ రెడ్డి, ఆలపాటి చంద్రశేఖరరావు, స్వర్ణ సుబ్బారావు, సిహెచ్.మురళీధరరావు, దశరథరామిరెడ్డి, కోటిరెడ్డి, వడ్లమూడి సుబ్బారావు, బాలకొండారెడ్డి, సోమశేఖర రావు, ముప్పాళ్ల ప్రకాష్, ఎస్.పి శంకర్ రెడ్డి, డి.ఎన్. నారాయణ, వెంకటరామిరెడ్డి, కొండల్రాయుడు, ప్రభాకర్ రెడ్డి తదితర రైతుసంఘాల ప్రతినిధులు వేదిక మీద తమ ఆలోచనల్ని పంచుకున్నారు.

సమావేశాన్ని జేపీ ప్రారంభిస్తూ... " రైతులంతా ఏకమై నిలబడితే ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం వారిని నిర్లక్ష్యం చేసే సాహసం ఎంతమాత్రం చేయలేదు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 7.2కోట్ల జనాభాలో 3.6కోట్లమంది ఓటర్లు ఉన్నారనుకుంటే, అందులో 1.2 కోట్లమంది రైతులు, 60 లక్షలమంది కౌలుదారులు ఉన్నారు. కులం, పార్టీ పేరుతో తమను చీల్చే రాజకీయ నాయకుల వల నుంచి బైటపడి రైతులు సంఘటితమైతే ఏ పార్టీ లేదా ప్రభుత్వం వారిని విస్మరించగలుగుతుంది?

తాత్కాలిక అవసరాలతో కూడిన ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయం మీద ఆధారపడిన 60శాతం ప్రజలు పేదరికంలో మగ్గిపోతుంటే దేశం ప్రగతి సాధించలేదు. పల్లెల్లో వ్యవసాయరంగంలో ఉన్న రైతు తలసరి ఆదాయం రూ. 15,000 ఉంటే అదే పట్టణ ప్రాంతంలో వ్యవసాయేతర రంగంలో ఉన్న వ్యక్తి తలసరి ఆదాయం రూ. 105,000 ఉంది. రాబోయే పదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో వారి కంటే పట్టణ ప్రాంతాల్లో వారి ఆదాయం 16 నుంచి 17 రెట్లు పెరుగుతుంది. ఈ తీవ్ర అసమానతలు దేశాభివృద్ధిని దెబ్బతీయటమేకాకుండా సమగ్రతకు ప్రమాదకరంగా పరిణమిస్తాయి.

ప్రభుత్వం తప్పుడు వంకల్ని చూపి ధరల్ని దెబ్బతీయకుండా, సరఫరా-డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ ధరలు లభించేలా అనుమతులివ్వాలి. ప్రపంచంలో ఏమూలకైనా తన ఉత్పత్తిని అమ్ముకునే స్వేచ్ఛను రైతుకు కల్పించాలి. దానర్థం ప్రభుత్వం పేదల, నిస్సహాయుల ఆహారభద్రత గురించి పట్టించుకోకూడదని కాదు. రైతుకు లాభసాటి ధరనిచ్చి ప్రభుత్వం ఆహారధాన్యాల్ని సేకరించి ఆహారభద్రతను కల్పించాలి.

ధరల పెరుగుదల కారణమంటూ దేశంలో ఎవరూ ఆత్మహత్య చేసుకోలేదు. కానీ గత పదేళ్ల కాలంలో వ్యవసాయం ఏ మాత్రం గిట్టుబాటు కాక తీవ్రనష్టాలతో అప్పుల్లో కూరుకుపోయి 10లక్షలమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వ్యవసాయం వాటా ఈవేళ జీడీపీలో 15శాతానికి పడిపోయింది. అంటే వ్యవసాయ ఉత్పత్తి మీద సంపాదించిన ప్రతి రూ. 100లో కేవలం రూ. 15 మాత్రమే ఒక వినియోగదారుడు ఖర్చు చేస్తున్నారు. అందులో ఆహారం విలువ కేవలం రూ. 5 మాత్రమే. ఒకవేళ వినియోగదారుడు ఆహారధాన్యాల మీద మరో రూ. 2 ఖర్చుచేస్తే అతను/ఆమె మీద కేవలం నామమాత్రపు భారం పడుతుంది, అదే రైతుకు ఆదాయం 40శాతం వృద్ధి చెందుతుంది. ఈ ఆర్థికతర్కాన్ని సక్రమంగా గుర్తించాలి. సామాన్య ప్రజల సాకును చూపి రైతును చంపవద్దని మీడియాకు విజ్ఞప్తి.

పత్తి ఎగుమతుల్ని నిషేధించాలంటూ తమిళనాడు ముఖ్యమంత్రి కేంద్రప్రభుత్వాన్ని కోరడం ప్రస్తావిస్తూ... అటువంటి నిర్ణయం వస్త్రపరిశ్రమ బడాబాబులకు మాత్రమే మేలుచేస్తుంది. లక్షలాది పత్తి రైతులకు గిట్టుబాటు ధర రాకుండా దెబ్బతీస్తుంది. వంటనూనెల్ని ఎటువంటి సుంకం లేకుండా దిగుమతి చేసుకుంటూ సబ్సిడీకి పంపిణీ చేస్తూ ప్రభుత్వం నూనెగింజల రైతుల్ని దెబ్బతీస్తున్నది. దిగుమతుల వల్ల స్థానికంగా పామాయిల్ ధర

పడిపోవటంతో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో విలువైన పామాయిల్ చెట్లను రైతులు తెగనరుకున్నారు.

కేవలం ప్రభుత్వాల అనంబద్ధ విధానాలను విమర్శించటమేకాకుండా, ప్రభుత్వాలు వ్యవసాయాన్ని లాభసాటి చేసి దేశ ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు. వ్యవసాయాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిధిలోకి తేవాలి. ప్రస్తుతం రైతులు వ్యవసాయ కూలీలు దొరక్క తీవ్రసమస్యను ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకాన్ని విస్తరించటం వల్ల వ్యవసాయ వర్గాలకు జీవనోపాధితోపాటు రైతుకు కొంత మానవ, ఆర్థిక వనరుల తోడ్పాటు లభిస్తుంది. మార్కెట్‌యార్డుల్లో రాజకీయ పందికొక్కుల స్థానంలో నిజమైన రైతుల ప్రతినిధుల్ని ఏర్పాటుచేయాలి. తమ ఉత్పత్తి ఎండిపోయేవరకూ ధాన్యం, పత్తి రైతులు మార్కెట్‌యార్డుల్లో వారాలతరబడి ఎదురుచూసే పరిస్థితి ఉండకూడదు. వందల కోట్ల రూపాయల మార్కెట్ సుంకాన్ని వసూలు చేసిన ప్రభుత్వం ఎందుకు మార్కెట్‌యార్డుల్లో డ్రయ్యర్లు, వే బ్రిడ్జిలు ఏర్పాటుచేసి, రైతులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోతోంది. వంటనూనెల మీద కఠిన సుంకాల్ని విధించి ఆ డబ్బును నూనెగింజల ఉత్పత్తిదారులకు పంచాలి. ధాన్యం, బియ్యం ఎగుమతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాశ్వత విధానంగా అమలు చేయాలి. ధాన్యం క్వింటాలుకు రూ.200 బోనస్ ప్రకటించాలి. అంతర్జాతీయ మార్కెట్‌లోకి ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని తొలగించేలా కేంద్రప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి.

విధానపరమైన అంశాల మీద నిర్ణయాలు తీసుకునేందుకు వివిధ పంటల ఉత్పత్తిదారుల సంఘాలు ఒక సమాఖ్యగా ఏర్పడాల్సిన అవసరం ఉంది. వ్యవసాయానికి సంబంధించిన రోజువారీ సమస్యలపై పోరాడేందుకు గ్రామస్థాయి వరకు రైతు ఐక్య వేదికలు ఏర్పాటు చేయాలి.

రాష్ట్రాల మధ్య బియ్యం, ధాన్యం రవాణాపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చిన చిన్న విజయానికి పొంగిపోవద్దు. రైతుల విజ్ఞాపనలు, ఐక్యపోరాటంతో భారత ప్రభుత్వం చీవాట్లు పెట్టి తీవ్రహెచ్చరికలు చేయటంతో రాష్ట్రప్రభుత్వం దిగివచ్చి దశాబ్దాల నిషేధాన్ని ఎత్తివేసింది. ఇంకా ఎన్నో మైళ్లు ప్రయాణించాల్సి ఉంది. తమ సమస్యల మీద పోరాటానికి నిజాయతీ, చిత్తశుద్ధిగల రైతులు రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో చట్టసభల్లోకి ప్రవేశించాలి.

రెండు రాష్ట్రస్థాయి కమిటీల ఏర్పాటుకు సమావేశం నిర్ణయించింది.

జేపీ కన్వీనర్‌గా ఈ దిగువ ప్రతినిధులతో 'గ్రామస్థాయి స్వతంత్ర రైతు సంఘాల రాష్ట్ర సమాఖ్య' ఏర్పాటైంది: నాగేంద్రనాథ్, నాగిరెడ్డి, కోటిరెడ్డి (నెల్లూరు జిల్లా), హనుమంతరెడ్డి (మెదక్), పెరుమాళ్ల పుల్లయ్య (వరంగల్), చెంగల్రాయరెడ్డి (చిత్తూరు), పులు కొండారెడ్డి (కడప), శంకరరెడ్డి (కర్నూలు), పాల్వాయి రామిరెడ్డి (నల్గొండ), స్వర్ణ సుబ్బారావు (ఖమ్మం), గుత్తా రాజేష్ (కృష్ణా), కె. ఆదినారాయణ (అనంతపూర్), రాఘవులు (ఖమ్మం), విజయకుమార్ (కృష్ణా), జగన్నాథ నాయుడు (చిత్తూరు), దశరథరామిరెడ్డి (కర్నూలు), వి. రామరాజు (పశ్చిమ గోదావరి), పరిటాల నారాయణ (ప్రకాశం), భాస్కరరావు (తూర్పుగోదావరి జిల్లా).

పి. ప్రభాకర రెడ్డి కన్వీనర్‌గా కింది ప్రతినిధులతో 'రాష్ట్రస్థాయి రైతు సంఘాల, పంటలవారీ రైతుసంఘాల సమాఖ్య' ఏర్పాటైంది: నాగేంద్రనాథ్, వడ్లమూడి సుబ్బారావు, నరసింహనాయుడు, బి.నరసింహారెడ్డి, నాగేశ్వరరాజు. ◆

# స్వేచ్ఛావాణిజ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్‌కూ విస్తరింపచేయాలి

- **బియ్యం/ధాన్యం రవాణాపై దేశీయంగా ఆంక్షల్ని తొలగిస్తూ జీవో జారీపై లోక్‌సత్తా హర్షం**

సూపర్‌ఫైన్ (సన్నరకం) బియ్యం/ధాన్యంపై ఆంక్షల్ని తొలగించి దేశంలో ఎక్కడైనా అమ్ముకునేందుకు తక్షణం వీలుకల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం జీవో ఎంఎస్ నెం. 58 జారీ చేయటం హర్షణీయం. "ఇది రాజకీయాలకు అతీతంగా లోక్‌సత్తా పార్టీ తలపెట్టిన 'రైతు ఐక్యతా ఉద్యమం' సాధించిన తొలి విజయం. బియ్యం, ధాన్యంపై ఆంక్షల్ని తొలగించటం వల్ల రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా స్వేచ్ఛావాణిజ్యానికి ద్వారాలు తెరచుకున్నాయి. దీన్ని అంతర్జాతీయ మార్కెట్‌లోకి కూడా విస్తరింపచేసి మిగులు ధాన్యాన్ని రైతులు ప్రపంచంలో ఎక్కడికైనా ఎగుమతి చేసుకునే వీలు కల్పించాలి".

దేశంలో ఆహారధాన్యాల ప్రధాన కొనుగోలుదారుగా ప్రభుత్వమే ఉందికాబట్టి రైతులకు లాభసాటి ధరను అందించి కాపాడే బాధ్యతను కూడా పూర్తిగా ప్రభుత్వమే వహించాలి. ధాన్యం రైతులకు తక్షణం మద్దతుధరకు అదనంగా కనీసం రూ.200 బోనస్‌ను ప్రకటించాలి. దళారీలను అదుపు చేసి... రైతుకు లాభం వల్ల మార్కెట్లో వినియోగదారునికి నష్టం అనే తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేయాలి.

మరోవైపు, పత్తి ఎగుమతిని అడ్డుకునేందుకు కూడా వస్త్రపరిశ్రమల లాబీ పెద్దఎత్తున రాజకీయ పైరవీలు చేస్తోంది. వీటికి ఎటువంటి పరిస్థితుల్లో లొంగకుండా తిప్పికొట్టాలి. విదేశాల్లో డిమాండ్ ఉన్నప్పుడు అమ్ముకునే హక్కు పూర్తిగా పత్తిరైతుకు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కొద్దిమంది కార్పొరేట్ సంస్థల యాజమాన్యాల కోసం లక్షలాది రైతులను దెబ్బతీయవద్దు.

# స్వతంత్ర రైతు సంఘాల సదస్సు విధాన ప్రకటన

దేశంలో, రాష్ట్రంలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ అత్యంత దీనంగా, అవసాన దశలో వుంది. రైతులకు వ్యవసాయం లాభసాటి కాకపోగా కనీసం గిట్టుబాటు ధర కూడా కరువైంది. సొంత వ్యవసాయం చెయ్యడానికి రైతులు, వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఆసక్తి చూపని స్థితి దాపురించింది. ఇప్పుడు వ్యవసాయం కౌలుదారుల మీద ఆధారపడి వుంది. వారికి కూలి, గడ్డి తప్ప ఎలాంటి మిగులూ వుండడం లేదు. ప్రకృతి వైపరీత్యానికి లోనైతే వారు కుదేలు అవుతున్నారు. ఆత్మహత్యలు తప్ప మార్గం లేనివారు అవుతున్నారు.

దేశంలో ఇప్పటికీ 60 శాతం మంది జీవనం వ్యవసాయం చుట్టూనే వుంది. కాని దేశ ఆదాయంలో వ్యవసాయం వాటా 15 శాతానికి పడిపోయింది. ఇలా 60 శాతం మంది చేతులకి కేవలం 15 శాతం ఆదాయం మాత్రమే వస్తే దేశంలో పారిశ్రామికాభివృద్ధి కూడా త్వరలోనే మందగిస్తుంది. గ్రామాలు కునారిల్లి శ్మశానవాతావరణం నెలకొంటుంది. ఈ పరిస్థితులలో తక్షణమే గ్రామీణ ప్రాంతాల ఆదాయాన్ని గణనీయంగా పెంచాలి. రైతులు పండించే పంటలకు లాభసాటి ధరలు అందించి తీరాలి. కాని ప్రభుత్వాలు ఏవైనా కాకుల్ని కొట్టి గద్దలకు వేసే చందంగా వ్యవసాయాభివృద్ధికి దోహదం చేసేవిగా వుండడం లేదు.

- దేశంలో ఆహారధాన్యాల మార్కెట్లపై వున్న ఆంక్షల్ని పూర్తిగా తొలగించాలి. రైతులు తమ పంటల్ని ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛని కల్పించాలి. మార్కెట్ లాభాలు నేరుగా రైతులకు దక్కే ఏర్పాట్లు చెయ్యాలి.
- ఆహారధాన్యాల ఎగుమతి, దిగుమతి విధానాలు పూర్తిగా రైతులకు అనుకూలంగా మార్చాలి. అంతర్జాతీయ మార్కెట్లలో లాభసాటి ధరలకు అమ్ముకునే స్వేచ్ఛ వుండాలి. ఆహారధాన్యాల దిగుమతులపై సుంకాలు లేకుండా స్థానిక రైతుల ఉత్పత్తులను దెబ్బతీసే విధానాలకు స్వస్తి చెప్పాలి. ఎగుమతి, దిగుమతులలో సుంకాలద్వారా లాభాలద్వారా వచ్చే ఆదాయాన్ని రైతులకు దక్కే ఏర్పాట్లు చెయ్యాలి.
- దేశానికి ఆహారభద్రత, పేదలకు చౌకగా పంపిణీకి ఏర్పాట్లను ఎవరూ కాదనరు. కానీ ఇందుకోసం పెద్ద కొనుగోలు దారుగా మారిన ప్రభుత్వం ఆహార ధాన్యాల ధరలను కనీస మద్దతు ధర పేరుతో గిట్టుబాటు లేకుండా చేయడం పూర్తిగా రైతాంగ వ్యతిరేక చర్య అవుతుంది. అందుచేత రైతులకు లాభసాటి ధరగా కనీస మద్దతు ధరను ప్రకటించి తీరాలి. పెట్టుబడులపై 50 శాతం విధిగా రైతులకు ఆదాయం లభించే విధంగా మద్దతు ధరలు వుండాలి.
- వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఎన్నికలు జరిపి రైతు ప్రతినిధులకు అధికారాలు దఖలు పరచాలి. దళారుల ప్రమేయం లేకుండా మార్కెటింగ్ వ్యవస్థను పటిష్ఠ పరచాలి. రైతులకు విస్తరంగా ప్లెడ్జిలోనులు అందేలా ఏర్పాటు చెయ్యాలి. గ్రామం యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చెయ్యాలి.
- ప్రభుత్వం రకరకాల రూపాలలో రైతులకు ఇస్తున్న సబ్సిడీలలో వాస్తవానికి రైతులకు చేరుతున్నది నామమాత్రంగా వుంది. రైతులకు నేరుగా సబ్సిడీలు అందించడానికి శాస్త్రీయమైన, పారదర్శకమైన పద్ధతిని తక్షణం చేపట్టాలి. ఇందులో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులకు, కౌలుదార్లకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చడానికి చర్యలు తీసుకోవాలి.
- రైతులకు కల్తీలేని విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. కల్తీని కఠినంగా నిరోధించడానికి అమ్మకందారుల్ని బాధ్యుల్ని చేసే విధంగా చట్టం తేవాలి. ఇవి సకాలంలో స్వేచ్ఛగా రైతులకు అందుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలి.
- రైతులకు ఆస్థి ఆధారంగా ఓవర్‌డ్రాఫ్ట్ పద్ధతిలో రుణం అందించేలా కిసాన్ క్రెడిట్ కార్డు వ్యవస్థని పటిష్ఠ పరచాలి. కౌలురైతులకు పంటరుణాలు అందించే ఏర్పాటు చెయ్యాలి.
- వ్యవసాయ పరిశోధన మీద పెట్టుబడులను పెంచాలి. రైతులకు ఈ విజ్ఞానాన్ని, పంటల సరళి, మార్కెట్ల అవకాశాలు సకాలంలో అందించడానికి గ్రామాలలో అగ్రిక్లినిక్‌లు ఏర్పాటు చెయ్యాలి. భూసార పరీక్షలు నిర్వహించడానికి అందుబాటులో ఏర్పాట్లు జరగాలి.
- కోల్డుస్టోరేజీ కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేసి రైతుల పంట మార్కెట్‌కు చేరేదాకా రక్షణ ఇవ్వాలి.
- ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను విస్తారంగా ఏర్పాటు చెయ్యాలి. ఉప ఉత్పత్తుల రూపకల్పనకు ప్రయత్నాలు ప్రారంభించాలి.
- రైతులకు ఆయా అంశాలపై తాజా సమాచారం అందించేందుకు ఒక సమాచార కేంద్రాన్ని శాశ్వత ప్రాతిపదికన హైదరాబాద్‌లో ఏర్పాటు చెయ్యాలి.
- సహకార (కో అపరేటివ్) చట్టంలో రైతుల ప్రయోజనాలకి అనుగుణంగా కొత్త మార్పులు తీసుకురావాలి. రైతుల ప్రయోజనాలే ప్రాతిపదిక కావాలి తప్ప ఏ కొద్ది మందికో లబ్ధిచేకూర్చే ప్రయత్నాలు అడ్డుకోవాలి.

**ముగింపు :** వ్యవసాయ రంగంలో పై విధానపరమైన మార్పులు సాధించడానికి రాజకీయాలకు అతీతంగా రైతులంతా సంఘటితం కావాలని స్వతంత్ర రైతు సంఘాల సదస్సు పిలుపునిస్తున్నది. ◆

# స్వతంత్ర రైతు సంఘాల వేదికలు

### 1. ఆంధ్రప్రదేశ్ స్వతంత్ర రైతు సంఘాల కాన్ఫెడేరేషన్ (పంటలు వేరైనా రైతులంతా ఒక్కటే)

రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని స్వతంత్ర రైతు సంఘాలు పనిచేస్తున్నాయి. ఇందులో అధికశాతం పంటల వారీగా రాష్ట్రస్థాయి రైతుసంఘాలను ఏర్పాటు చేసుకుని విశేష కృషి చేస్తున్నాయి. చెరుకు, పామోలిన్, కొబ్బరి, పసుపు తదితర పంటల వారీగా రైతు సంఘాలు కార్యకలాపాలను సాగిస్తున్నారు. అలాగే పాడి, పౌల్ట్రీ తదితర అనుబంధ పరిశ్రమల రైతు సంఘాలు కూడా వున్నాయి.

ఎవరి రైతు సంఘాలను వారు వుంచుకుంటూనే ఇలాంటి రాష్ట్రస్థాయి సంఘాలన్నీ ఒక ఉమ్మడి వేదికను ఒక కాన్ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసుకోవడం తక్షణావసరంగా ఈ సదస్సు భావిస్తున్నది. అలాంటి ఉమ్మడి వేదిక రూపకల్పనకు ముందుకు రావలసిందిగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నది.

- పంటలు వేరైనా రైతులంతా ఒక్కటే అన్నది నినాదం కావాలి. పంటలవారీగా ఒంటరిగా పోరాడుతున్న ఈ సంఘాలకు అందరి తోడ్పాటు అందించడానికి ఈ కాన్ఫెడరేషన్ వేదిక కావాలి.
- మొత్తం వ్యవసాయ రంగంలో విధాన పరమైన మార్పుల కోసం రైతుల సంఘటిత శక్తికి ప్రతీకగా, ఉమ్మడి ఉద్యమానికి ఈ కాన్ఫెడరేషన్ వేదిక కావాలి.
- ఇలాంటి దీర్ఘకాలిక లక్ష్యాలతో ఎవరి రైతు సంఘాలను, వాటి స్వయంప్రతిపత్తిని వుంచుకుంటూనే ఉమ్మడి వేదిక ఏర్పాటుకు ముందుకు రావలసిందిగా ఈ సదస్సు రాష్ట్రస్థాయి రైతు సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నది.

### 2. రైతు వేదిక (గ్రామస్థాయి స్వతంత్ర సంఘాల సమాఖ్య)

రాజకీయాలకు అతీతంగా గ్రామస్థాయిలో రైతుల్ని ఐక్యం చేసే స్వతంత్ర రైతు సంఘాలను పటిష్టం చెయ్యాలి. అట్టడుగు స్థాయిలో ఇలాంటి ఐక్యతను సాధించకుండా రైతుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి, వ్యవసాయాన్ని లాభసాటి చెయ్యడానికి బలోపేతమైన రైతు ఉద్యమం రూపుదిద్దుకోదు.

ఇప్పటికే గ్రామస్థాయిలో కొన్ని స్వతంత్రరైతు సంఘాలు పనిచేస్తున్నాయి. లేని చోట్ల రాజకీయాలకి అతీతంగా గ్రామస్థాయిలో రైతులందరినీ ఐక్యం చేసే రైతు వేదికల్ని రూపొందించుకోవాలి.

- స్థానికంగా రాజకీయాలకు అతీతంగా రైతుల్ని ఐక్యపరిచే సాధనంగా ఈ వేదిక వుంటుంది.
- స్థానిక వ్యవసాయపరమైన సమస్యలపై రైతులకు తోడ్పాటునిచ్చే వేదికగా వుంటుంది.
- రైతుకు వ్యవసాయపరమైన శాస్త్రీయ సమాచారాన్ని అందించడానికి, విధానపరమైన మార్పుల మీద అవగాహన పెంపొందించడానికి వేదికగా వుంటుంది.
- రైతాంగ ఉద్యమాలకు గ్రామాలలోని స్వతంత్ర రైతుసంఘాలు పునాదిగా వుంటాయి.

రైతులకు లాభసాటిగా వ్యవసాయ రంగాన్ని సంస్కరించడానికి రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో బలమైన, తీవ్రమైన రైతు ఉద్యమాలు తప్పనిసరి, ఇది గ్రామాలలో స్వతంత్రరైతు సంఘాలు లేకుండా సాధ్యం కాదు. అందుచేత ఈ స్వతంత్ర రైతు సంఘాల ఏర్పాటుకు వాటి స్వయం ప్రతిపత్తికీ వాటి నిత్యకార్యకలాపాలను ప్రోత్సహించడానికి రాష్ట్రస్థాయిలో "గ్రామస్థాయి స్వతంత్రరైతు సంఘాల రాష్ట్ర వేదిక" అవసరంగా ఈ సదస్సు భావిస్తున్నది. రైతు వేదిక పేరుతో గ్రామరైతు సంఘాల వేదికను రూపొందించాలని ఈ సదస్సు తీర్మానించింది. ◆

## సమరభేరి

పల్లవి: త్యాగోన్నత లోక్‌సత్తా కార్యశూరులారా...
ఐక్యంగా కదలిరండి ఘనవిజయం మనదేరా...
ఎన్నాళ్ళీ పెనుచీకటి... ఇంకెన్నాళ్ళు...

చ॥ అవినీతి అక్రమాలు రోజురోజు పెరుగుతుంటె
సాధించిన స్వాతంత్ర్యం ఎండమావి అయిపోదా..?
ప్రజాధనం కొల్లగొట్టె నయవంచక నేతలుంటె
సిరుల తల్లి భరతమాత భవిష్యత్తే ముగిసిపోద...?
దేశమంటే మట్టికాదు చైతన్యం మనుషులోయ్
బాధ్యత నువు గుర్తెరిగి పిడికిలెత్తి కదలవోయ్

చ॥ ఐకమత్యమే బలం సాధించనిదేది లేదు
కార్యోన్ముఖ కర్తవ్య కార్యశీలికెదురు లేదు
నాకేమని వూరుకుంటే బ్రతుకు చీకటవుతుంది
సస్యశ్యామల దేశం ఎడారిలా మారుతుంది
మనసా, వాచా, కర్మణ ప్రతినబూనవోయ్
భరతమాత ఔన్నత్యపు శుభకీర్తిని పెంచవోయ్

**నటికుదిటి రాధాకృష్ణమూర్తి, అవనిగడ్డ**

## మీడియాకు విడుదల (హైదరాబాద్, 06/12/2010)

The Following is the text of the memorandum that Lok Satta Party President Dr. Jaya Prakash Narayan and farmers' leaders submitted to the Chief Minister N.Kiran Kumar Reddy at Secretariat today (December 06,2010, Monday):

**గౌ॥ శ్రీ యన్. కిరణ్‌కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, హైదరాబాద్**

**గౌరవనీయ ముఖ్యమంత్రి గారికి,**

ఆంధ్రప్రదేశ్ స్వతంత్ర రైతు సంఘాల సదస్సు డిసెంబరు 5వ తేదీన హైదరాబాద్‌లో జరిగింది. ధాన్యం/బియ్యం అంతరాష్ట్ర రవాణాపై వున్న ఆంక్షలను తొలగిస్తూ స్వేచ్ఛా మార్కెట్‌కు వీలు కలిగిస్తూ మీ సారధ్యంలో రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఈ సదస్సు స్వాగతిస్తున్నది. నిబంధనల పేరుతో పరోక్షంగా ఎలాంటి ఆంక్షలు లేకుండా ఈ జి.వోను శాశ్వత ప్రాతిపదిక మీద అమలు చేయడానికి చర్యలు తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**ఈ క్రింది తక్షణ సమస్యలపై మీరు చొరవ తీసుకుని వెంటనే పరిష్కరించాల్సిందిగా కోరుతున్నాం.**

1. **(ఎ)** డిసెంబరు 7వ తేదీన ఢిల్లీలో జరుగుతున్న కేంద్రప్రభుత్వ ఎకనమిక్ ఎఫైర్స్ ఎంపవర్డ్ కమిటీ సమావేశంలో నాన్-బాస్మతి బియ్యం ఎగుమతులపై వున్న నిషేధాన్ని తొలగించే విధంగా రాష్ట్రప్రభుత్వం తన పలుకుబడిని వినియోగించి అంతర్జాతీయ మార్కెట్‌లో బియ్యం అమ్ముకోడానికి వున్న ఆంక్షల్ని కూడా తొలగించడానికి పూర్తిస్థాయిలో ప్రయత్నంచవలసిందిగా కోరుతున్నాం.

   **(బి)** పత్తి ధరలు రైతులకు అనుకూలంగా మారుతున్న తరుణంలో పత్తి ఎగుమతులను నిషేధించి ధరలను అదుపు చెయ్యాలంటూ జౌళి పరిశ్రమలకు వత్తాసుగా తమిళనాడు ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖ, చేస్తున్న ఒత్తిడి రాష్ట్రంలో పత్తి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. అందుచేత ఢిల్లీలో జరగనున్న పై సమావేశంలో పత్తి ఎగుమతులపై నిషేధం విధించకుండా రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకోవలసిందిగా కోరుతున్నాం.

2. ధాన్యం మద్దతు ధర పై క్వింటాలుకు ₹ 200 లు బోనస్‌గా ప్రకటించి రాష్ట్రప్రభుత్వం రైతుల్ని ఆదుకోవాల్సిందిగా కోరుతున్నాం. రైతుల నుండి ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మండలానికి 1 లేదా 2 కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లకు తక్షణం ఏర్పాట్లు చెయ్యాల్సిందిగా కోరుతున్నాం.
   - ■ ప్రతి మార్కెట్‌యార్డులోనూ డ్రయ్యర్లను, ఎలక్ట్రానిక్ కాటాలను ఏర్పాటు చెయ్యాలని కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతున్నాం.

3. చెరుకుకు రాష్ట్రప్రభుత్వ సూచన ధరగా టన్నుకి ₹ 2500 లుగా ప్రకటించి ఆ ధరకు కొనుగోళ్లు జరిగేలా చూడాలి.

4. పామాలిన్ రైతులకు మార్కెట్ ఇంట్రవెన్షన్ స్కీము కింద 2009 సం॥ నుండి చెల్లించాల్సిన 60 కోట్ల రూపాయలను రాష్ట్రప్రభుత్వం వెంటనే చెల్లించి, కేంద్రం వాటాను రాబట్టుకోవలసిందిగా కోరుతున్నాం.
   - ■ పామాలిన్ రైతుల నుండి నేరుగా వసూలు చేస్తున్న 4 శాతం వ్యాట్ టాక్స్‌ను రద్దు చెయ్యాలి.
   - ■ నూనెల దిగుమతులపై విధిగా సుంకం విధించి దాని నుండి వచ్చే ఆదాయాన్ని రైతులకు సబ్సీడీగా ఇప్పించే ఏర్పాటు చెయ్యాలి.

5. అన్ని పంటలకు పావలా వడ్డీ రుణాలను మంజూరు చెయ్యాలి. సంవత్సరానికి ఒకేసారి జూన్ 30 ని చెల్లింపు గడువుగా నిర్ణయించి వర్తింపచెయ్యాలి.

6. 50 శాతం పంట నష్టపోయిన ప్రాంతాలలో రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సీడీని ఎకరాకు ₹ 4000 లకు పెంచి అందరికీ ఇవ్వాలి.

7. రాష్ట్రంలో డిసెంబరు 15 నుండి అమలు చేయ తలపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులను, వ్యవసాయ సీజను కారణంగా ఫిబ్రవరికి వాయిదా వెయ్యాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు వర్తింపజేసి రైతులకు, కౌలుదారులకు నేరుగా ప్రయోజనం కల్పించడానికి తగు చర్యలు తీసుకోవాలి.

8. కౌలుదారులకు, పంటరుణాలు, ఇతర ప్రభుత్వ రాయితీలు పొందడానికి వీలుగా ఏర్పాటు చెయ్యాలి. రైతుల యాజమాన్య హక్కులకు భంగం లేకుండా ఈ ఏర్పాట్లు చెయ్యాలి.

9. వ్యవసాయంలో ఆధునీకరణకు వినియోగించే అన్ని రకాల వ్యవసాయ ఉపకరణాలపై ఎక్సైజ్ డ్యూటీని తొలగించాలి. - సోర్స్ దగ్గరే సబ్సీడీ ఇచ్చి అందరూ కొనుగోలు చేసుకోడానికి వీలు కల్పించాలి.
   - ■ ప్రతి మండలంలోనూ ఒకటి, రెండు రైతు సేవాకేంద్రాలు లేదా అగ్రిక్లినిక్‌లను ఏర్పాటు చెయ్యాలి. కంప్యూటర్లతో మార్కెట్ ధరలు, పంటల సరళి, వ్యవసాయ విజ్ఞానం, ఆధునిక యంత్రాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లు వగైరాలలో రైతులకు సేవలందించే కేంద్రాలుగా చెయ్యాలి.

ఈ తక్షణ సమస్యలపై వెంటనే చర్యలు తీసుకుని రాష్ట్రంలో రైతుల్ని ఆదుకోవలసిందిగా కోరుతున్నాం. ◆

# ధాన్యం రవాణాపై ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన జి.వో.

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Civil Supplies – KMS 2010-11 – Lifting of restrictions on Movement of Preferred varieties of Rice/Paddy to other States – Permission to utilize levy free eligibility of raw rice to other States by road – Orders – Issued.

CONSUMER AFFAIRS, FOOD AND CIVIL SUPPLIES (CS.I) DEPARTMENT

G.O.Ms.No. 58 Dated 4-12-2010

Read the following:

1) G.O.Ms.No. 45 CA, F & CS (CS.I) Department dated 5.10.2010.
2) Proposal of the Commissioner of Civil Supplies, Hyderabad – vide No. PI(1)/3428/2009 dated 15.11.2010.

...

O R D E R :-

Government vide reference 1st read above issued orders on procurement policy for the Kharif Marketing Season 2010-11.

2. In the reference second read above, proposals have been received stating that presently, the price of preferred varieties are not encouraging; against around Rs.1500 per quintal last year, they are presently ruling much below and unless better price for these varieties is ensured to these varieties, the farmers will not have any incentive to cultivate these varieties, thereby resulting in fall of acreage of these varieties in the ensuing seasons and increase in price of super fine varieties during the year 2011. It has been proposed to remove the restrictions imposed on the movement of preferred varieties of paddy / rice – vide G.O. 1st read above – and also to permit utilization of the levy free eligibility of raw rice meant for sale outside the State by road.

3. Government after careful examination of the proposal and taking into consideration the current low price being offered for the superfine varieties and the imperative need to provide remunerative price to the farmers who cultivate these varieties orders that the restrictions on movement of preferred varieties of rice/paddy be removed with immediate effect.

4. Government also order that the levy free eligibility raw rice be permitted to be moved to places outside the State by road so as to enable the millers to clear the levy free stocks by road and further purchase paddy from the farmers at MSP and above.

5. The Commissioner of Civil Supplies is authorized to issue necessary operational guidelines for implementing the above order.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)

SANJAY JAJU
EX.OFFICIO SECRETARY TO GOVERNMENT

# వరకట్న వ్యతిరేక దినం

- **వరకట్న రహిత సమాజానికి ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

సాంకేతికాభివృద్ధి చెందిన సమాజంలో వరకట్నం సాంప్రదాయ రూపాన్ని మార్చుకుని రకరకాల ముసుగుల్లో మహిళల మీద జులుం చెలాయిస్తోంది. ఈ మార్పులకు అనుగుణంగా తగు చర్యలు చేపట్టి మహిళల్ని వరకట్నం బారి నుంచి కాపాడేందుకు పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం కనీస చర్యలు కూడా చేపట్టటం లేదు. న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ సమావేశ మందిరంలో లోక్‌సత్తా లీగల్‌సెల్ వరకట్న వ్యతిరేక దినాన్ని పాటించింది. లోక్‌సత్తా లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ సి.వి.ఎల్ నరసింహారావు, లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి కె.గీతామూర్తి, మహిళాసత్తా నేతలు ఎన్.సరోజాదేవి, మహాలక్ష్మి, గజానని, తెలుగుదేశం ప్రతినిధి నన్నపనేని రాజకుమారి, ప్రజారాజ్యం ప్రతినిధి షాయిదా బేగం, ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ నేత మురళీధర్ దేశ్‌పాండే, హైదరాబాద్ జిల్లా న్యాయాధికారి కార్యదర్శి సి. వి రాంబాబు, న్యాయవాది కల్పవల్లి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

21వ శతాబ్దంలోకి ప్రవేశించినా, మహిళలు అన్నిరంగాలలో ముందంజలోకి వస్తున్నారని గణాంకాలు చెబుతున్నా, వరకట్నం వేధింపులు, చావులు, హత్యలు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. ఇందుకు గత ఇరవైఏళ్లలో భారత్‌లో దాదాపు కోటి మంది ఆడపిల్లల భ్రూణహత్యలు జరగటమే నిదర్శనం. లోక్‌సత్తా లీగల్‌సెల్, మహిళాసత్తా ఇతర మహిళా సంఘాలు ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి వరకట్న దినాన్ని చైతన్యం కలిగించేలా నిర్వహించాలని కోరినా తగిన స్పందన కరవైంది.

1961 వరకట్న వ్యతిరేక చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేలా న్యాయ, పోలీసు వ్యవస్థల్ని, సంబంధిత ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం పరిచేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. వరకట్నం ఇవ్వటం, తీసుకోవటం రెండూ నేరంగా సమాజంలో చైతన్యం తేవాలి. వరకట్న రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి.

# 'ఉపాధ్యాయసత్తా' కొత్త అధ్యక్షునిగా ఎస్. బాలకిషన్ రావు



లోక్‌సత్తా పార్టీ అనుబంధ ప్రజాసంఘం 'ఉపాధ్యాయసత్తా' రాష్ట్ర నూతన అధ్యక్షునిగా మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ మండలంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సంబరాజు బాలకిషన్ రావు (94412 78857) నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఉపాధ్యాయసత్తా అధ్యక్షునిగా ఉన్న ప్రొఫెసర్ విజయకుమార్ మహబూబ్‌నగర్ డి.ఈ.వో. గా బాధ్యతలు చేపట్టటంతో లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో జేపీ పర్యవేక్షణలో జరిగిన ఉపాధ్యాయసత్తా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఉపాధ్యాయ సత్తా సమన్వయకర్త జి.రాజారెడ్డి, ఉపాధ్యాయ సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సత్తిబాబు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయ సత్తా రాష్ట్ర కార్యవర్గాన్నుద్దేశించి జేపీ మాట్లాడుతూ... "సాంప్రదాయ రాజకీయ పార్టీల అనుబంధ ఉపాధ్యాయ సంఘాల్లా కేవలం సొంత డిమాండ్ల సాధన కోసం రోడ్లెక్కటం పనిగా పెట్టుకోకుండా ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేలా ఉపాధ్యాయసత్తా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలి. 'ఉపాధ్యాయునికి గౌరవం-విద్యార్థికి భవిష్యత్తు-సమాజానికి ప్రగతి' అనే మూడు సూత్రాల లక్ష్యంతో విద్యాహక్కు చట్టం, సర్వశిక్షా అభియాన్, రాజీవ్ మాధ్యమిక శిక్షాఅభియాన్‌లు అట్టడుగు స్థాయి వరకు సక్రమంగా పనిచేసేలా కృషి చేయాలి. "అమెరికాలో ఏదైనా ఒక ప్రాంతానికి చిరునామా గుర్తులు చెప్పాలంటే ఫలానా స్కూలు సెంటర్ అని చెబుతారు. అక్కడ ప్రభుత్వ స్కూలు స్థాయిని బట్టి చుట్టుపక్కల స్థలాల రేట్లు, ఇళ్ల అద్దెలు ఉంటాయి. అలా విద్య చుట్టూ కేంద్రీకృతమైన సమాజాన్ని సాధించటం మన లక్ష్యం కావాలి" అన్నారు.

## ఈవీఎంల రిగ్గింగ్ ద్వారానే బీహార్‌లో జేడీయూ-బీజేపీ కూటమి ఘనవిజయం అని ఎవరైనా అనగలరా?

ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రాల (ఈవీఎంలు)కు వ్యతిరేకంగా ప్రచారం చేయటం అవాంఛనీయమని బీహార్ ఎన్నికల ఫలితాలు మరోసారి నిర్ధారించాయి. 'అవినీతిని ఎదుర్కొనేందుకు ఒక మార్గంగా ఎన్నికల సంస్కరణలు' అంశంపై జేపీ తన ఢిల్లీ పర్యటనలో భారత ఎన్నికల కమిషన్‌తో చర్చించారు.

# రైతుకు లాభం వల్ల వినియోగదారులకు నష్టం అనే తప్పుడు వాదనను ఇకనైనా ఆపాలి...రైతులకు న్యాయమైన ధరలు దేశాభివృద్ధికి తప్పనిసరి: జేపీ

వ్యవసాయ సంక్షోభంపై ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ డా॥ రంగరాజన్, ప్రధాన ఆర్థిక సలహాదారు కౌశిక్ బసు, ప్రణాళికాసంఘం సభ్యులతో చర్చించేందుకు లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 30వ తేదీ నుంచి మూడురోజులు ఢిల్లీ పర్యటించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ....

రైతుకు న్యాయమైన, లాభసాటి ధర లేకపోతే ఆర్థికాభివృద్ధి, సామాజిక సమతుల్యత, రాజకీయ స్థిరత్వం ప్రమాదంలో పడతాయి. వ్యవసాయోత్పత్తుల స్వేచ్ఛావాణిజ్యం మీద ఆంక్షలు ఉన్నంతవరకూ న్యాయమైన, లాభసాటి ధరలు సాధ్యంకావు.

రాష్ట్రం వెలుపలకే కాకుండా జిల్లాల మధ్య కూడా బియ్యం రవాణాపై నిషేధం విధించిన ఒకే ఒక్క రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో పేరుమోసింది. గోదాములు గత ఏడాది ఆహారధాన్యాల నిల్వలతో పొంగిపొర్లుతుండగా, మరోపక్క పెద్దఎత్తున పంట దిగుబడి వస్తుండగా, బియ్యం స్వేచ్ఛారవాణాపై నిషేధం ఉండటం వల్ల ధాన్యం ధర విపరీతంగా పడిపోయింది. లోక్‌సత్తా పార్టీ రెండునెలల పోరాటంతో జాతీయస్థాయిలో ప్రభుత్వం కదిలి ఒత్తిడి తేవటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు బియ్యం రవాణాపై దేశీయంగా ఉన్న ఆంక్షల ఎత్తివేతకు జీవో జారీ చేసింది. ఇది కూడా చాలదు. మిగులు ధాన్యాన్ని రైతు విదేశాల్లో అమ్ముకునే అవకాశాన్ని కల్పించాలి.

వినియోగదారుని ప్రయోజనాలను పరిరక్షించేందుకే వ్యవసాయోత్పత్తుల ధరల్ని తక్కువస్థాయిలోనే తొక్కిపట్టే విధానాన్ని అనుసరిస్తున్నట్టు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో వరుస ప్రభుత్వాలు తప్పుడు వాదనను వినిపిస్తున్నాయి. ధాన్యం రైతుకు ధర పెంచటం వల్ల వినియోగదారునికి బియ్యం ధర పెరగాల్సిన అవసరం లేదు. ఒకవేళ పెరగాల్సి వచ్చినా వినియోగదారునిపై ఆ ప్రభావం నామమాత్రంగానే ఉంటుంది. కానీ రైతుకు మాత్రం అది జీవన్మరణ సమస్య ఎగుమతుల వల్ల మిల్లర్లకు లాభం అనే మాట రాజకీయ విభేదాలను సృష్టించేందుకు తప్ప మరెందుకూ పనికిరాదు. రాష్ట్రంలో కోటీ 80లక్షలమంది రైతులు, కౌలుదారులు కనీస ఆదాయం లేకుండా ఆత్మహత్యలు చేసుకుంటుంటే నానాటికీ పేదరికంలోకి జారిపోతుంటే ఎలా బాగుచేయాలా అనే ఆలోచనను వదిలేసి రైతును దెబ్బతీసేలా రాజకీయాలు చేయటం దారుణం. టాటాలు వంటి కంపెనీలు ఎగుమతులు చేస్తుంటే ఇంకా చేయండి, దేశానికి విదేశీ మారకద్రవ్యం తీసుకురండి అని తెగ ఊదర గొట్టే నేతలు రైతుల్ని మాత్రం ఎగుమతులు చేయొద్దని చెప్పటం దుర్మార్గం. రైతులు అమాయకులని, సంఘటితం కాలేరని, వారి తరుపున ఎవరూ వాస్తవాలు చెప్పరని మోసం చేస్తున్నారు. దేశాన్ని దోచుకున్నా కూడా అధికారం లేదని శివాలెత్తుతున్న వారు రైతుకు కనీసం కష్టార్జితానికి తగిన ప్రతిఫలం అడుగుతుంటే రాజకీయం చేయటమా? ఇప్పటివరకూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాలు చేసింది 'రైతుద్రోహం'.

ఈవేళ పరిస్థితుల్లో రుతుపవనాలు కాస్త దయదలిస్తే ధాన్యం రైతుకు పెట్టిన పెట్టుబడి మాత్రమే వస్తోంది, కౌలురైతుకు మాత్రం అది కూడా రాకపోగా నికర నష్టం వస్తోంది. గ్రామంలో ఉన్న ఒక రైతు తలసరి ఆదాయం పట్టణ ప్రాంతంలో వ్యవసాయేతర రంగంలో ఉన్న వ్యక్తి ఆదాయంలో ఏడోవంతు ఉండటం తీవ్ర అసమానతలకు అద్దం పడుతోంది. పేదరికంలోకి జారిపోతున్న రైతులు తమ ఉత్పత్తుల్ని కొనలేక, సేవల్ని వినియోగించుకోలేకపోతుంటే పారిశ్రామిక ఉత్పత్తుల, సేవల రంగంలో దేశం ఎలా ముందుకు దూసుకెళ్లగలుగుతుంది.

వ్యవసాయ సంక్షోభం గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అగాధాన్ని తీవ్రతరం చేస్తోంది. ఫలితంగా తక్కువ నైపుణ్యాలతో పొట్ట చేతపట్టుకుని పట్టణ ప్రాంతాలకు వలసవెళ్లి రోజు కూలీలుగా బతికే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

భారతదేశంలోని ప్రభుత్వాలు రైతులకు న్యాయమైన, లాభసాటి ధరల్ని ఇవ్వటంతోపాటు చైనా అనుభవం నుంచి నేర్చుకుని పట్టణ, గ్రామ ఎంటర్‌ప్రైజ్‌లను (టి.వి.ఇలు) ప్రోత్సహించాలి. దీనివల్ల చైనాలో 20కోట్ల ఉద్యోగాలు రూపుదిద్దుకున్నాయి. అందుకే లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో కనీసం 1000 చిన్నపట్టణాల అభివృద్ధి కోసం పోరాడుతోంది. అవి ఆర్థిక కేంద్రాలుగా తయారై ఉద్యోగాలు, మెరుగైన జీవన పరిస్థితులను అందించటం ద్వారా గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గిస్తాయి. ◆

## పిల్లల్లో మధుమేహం

ప్రపంచంలో మధుమేహంతో బాధ పడుతున్న పిల్లలలో 5వ వంతు (20%) భారతదేశంలో వుండటం జాతీయ బాలల దినోత్సవం - అంతర్జాతీయ మధుమేహ దినోత్సవం (నవంబర్ 14) ఒకటే కావడం యాదృచ్ఛికం. పిల్లలకు సోకే సాధారణ దీర్ఘకాలిక వ్యాధులలో మధుమేహం కూడా ఒకటి. భారతదేశంలో ప్రతీరోజు 200 మంది పిల్లలు మధుమేహం బారిన పడుతున్నారు. ఈ వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే దాని దుష్ఫలితాలు అంత బాగా నివారించవచ్చు.

# ధాన్యం, చెరకు, పామాయిల్ రైతుల్ని తక్షణం ఆదుకోండి

## అవినీతిపై కఠిన చర్యల్ని చేపట్టండి కాంగ్రెస్ ప్రభుత్వానికి లోక్‌సత్తా డిమాండ్

వైఎస్ జగన్మోహన రెడ్డి, విజయలక్ష్మి రాజీనామాలు పైకి కాంగ్రెస్ అంతర్గత వ్యవహారంగా కనిపిస్తున్నా, అధికారపార్టీలోని రాజకీయ డ్రామాల వల్ల రాష్ట్రంలో పాలన పూర్తిగా స్తంభించి ప్రజలు సమస్యలతో నలిగిపోతున్నారు. కాంగ్రెస్‌లో గత 14నెలలనుంచీ సాగుతున్న అధికార పోరు వారి రాజీనామాలతో ఈవేళ పరాకాష్టకు చేరుకుంది. కాంగ్రెస్ పార్టీ లోని అంతర్గత కుమ్ములాటల్ని రాష్ట్రం నెత్తిన రుద్దటం క్షమార్హంకాదు.

రాష్ట్రంలో ముఖ్యంగా ధాన్యం, చెరకు, పామాయిల్ రైతులు తీవ్రస్థాయి తక్షణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి పట్టటం లేదు. మార్కెట్ ధర లేక, కూలీలు దొరక్క కొన్ని చోట్ల ధాన్యం రైతులు పంటపొలాల్ని దున్నేయటమో, తగలబెట్టటమో చేస్తున్నారు. పండినపంటను రైతులు తగలబెట్టుకోవటానికి మించిన దారుణం మరోటి ఉండదు. అయినా పట్టించుకునే తీరిక పాలకులకు లేకపోవటం దుర్మార్గం. పంట నష్టానికి పరిహారం, తడిసిన ధాన్యం కొనుగోలు, తెగుళ్లు తగిలితే చేపట్టాల్సిన చర్యలకు తోడ్పాటు లేక రైతుల్లో తీవ్ర నిరాశానిస్పృహలు నెలకొన్నాయి. కనీస మద్దతు ధరలో దాదాపు సగం ధరకే ధాన్యాన్ని కొంటూ రైసు మిల్లర్లు అమాయక రైతుల్ని దోపిడీ చేస్తున్నా పట్టించుకునే తీరికే సర్కారుకు లేదు. చెరకు క్రషింగ్ సీజన్ మొదలైనా ఇంతవరకు రాష్ట్ర సలహా ధరను ప్రకటించలేదు. రైతులకు కూలీల సమస్య లేకుండా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయాన్ని కూడా చేర్చాలి.

మరోపక్క ప్రజల్ని, పాలనను గాలికొదిలేసి నేతలు, ఉన్నతాధికారులు యథేచ్ఛగా ప్రజాధనాన్ని, సహజవనరుల్ని దోచేస్తున్నారు. అవినీతి లేని రంగమంటూ లేకుండా పోయింది. అవినీతిని బైటికి లాగి కఠినచర్యల్ని చేపట్టాలి. ధాన్యం, చెరకు రైతులకు కొత్త ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి తక్షణం గిట్టుబాటు ధరను కల్పించాలి. పాలకపార్టీ పెద్దఎత్తున అవినీతికి పాల్పడటానికి, ప్రజాప్రయోజనాల్ని విస్మరించి అధికార క్రీడ సాగించటానికి కేంద్రీకృత పాలనావ్యవస్థ ప్రధాన కారణం. లోక్‌సత్తా తొలినుంచీ చెబుతున్నట్టు అధికారాన్ని హైదరాబాద్ నుంచి జిల్లాలకు వికేంద్రీకరిస్తే ఇలాంటి పరిస్థితుల్ని నివారించవచ్చు.

---

# రాష్ట్రంపై అవినీతి ముద్రను తొలగించేందుకు చాలా కృషి చేయాల్సి ఉంది

వ్యవసాయానికి పునరుత్తేజం తేవటం, అవినీతిని కట్టడి చేయటం, పరిమిత వనరుల్ని ప్రజోపకరమైన ఉత్పాదకను పెంచే రీతిలో కేటాయించటం ఈవేళ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యాలు.

కొంతమంది అవినీతిపరుల్ని పక్కనపెట్టి నిజాయతీపరుల్ని ప్రోత్సహిస్తున్నందుకు ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్ రెడ్డికి అభినందనలు. దేశంలోనే అత్యంత అవినీతి రాష్ట్రంగా, అవినీతి భారతంలో ఒలింపిక్ బంగారు పతకాన్ని సాధించిన ఆంధ్రప్రదేశ్ ఆ ముద్రను తొలగించుకునేందుకు చాలా కృషి చేయాల్సి ఉంది. అవినీతి నిరోధక చట్ట సవరణకు లోక్‌సత్తా పార్టీ ఒక ముసాయిదా బిల్లును రూపొందించి కిరణ్ కుమార్ స్పీకర్‌గా ఉన్నప్పుడు అందించింది. ముఖ్యమంత్రిగా ఇప్పుడు అవినీతి నిర్మూలనకు ఆయన ఆ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి.

రాష్ట్రంలో వనరుల్ని విచక్షణారహితంగా వెదజల్లిన తీరును కూడా ముఖ్యమంత్రి దృష్టికి జేపీ తీసుకురావడం జరిగింది. ఏ మాత్రం లాభదాయకత కాని అసంబద్ధ సాగునీటి ప్రాజెక్టు డిజైన్ రూపకల్పన కోసం ఒక ఏజన్సీకి రూ.1000 కోట్లు కట్టబెట్టారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తక్కువఖర్చుతో, త్వరితంగా కృష్ణానది మూడో దశ పథకం అందుబాటులో ఉండగా, అంతకు నాలుగురెట్లు వ్యయంతో ఎక్కువకాలం పట్టే ప్రయాసతో కూడిన గోదావరి జలాల్ని తరలించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాధనం ఎడాపెడా దుర్వినియోగానికి, దోపిడీకి ఇవి మచ్చుతునకలు మాత్రమే. అదేసమయంలో విద్యాపథకాల్లో తనవంతు వాటాను కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం విలువైన కేంద్ర సహాయాన్ని చేతులారా వదులుకుంటోంది.

## థామస్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలి

సీవీసీ చట్టంలోని నిబంధనల్ని ఉపయోగించి కేంద్ర విజిలెన్స్ కమిషనర్ పి.జె. థామస్‌ను భారత ప్రభుత్వం తక్షణం పదవి నుంచి తొలగించాలి. 2-జీ స్పెక్ట్రం కేటాయింపుల్లో నిర్దిష్టమైన ఆధారాలతో అనుమానాస్పద పాత్ర పోషించిన థామస్ నియామకాన్ని లోక్‌సత్తా తొలి నుంచీ వ్యతిరేకిస్తోంది. హితవచనాలు వినకుండా ప్రభుత్వం భస్మాసుర హస్తాన్ని తన నెత్తినే పెట్టుకుంది. అవినీతిమయమైన స్పెక్ట్రం కేటాయింపులన్నిటినీ ప్రభుత్వం తక్షణం రద్దుచేసి, తిరిగి అంతర్జాతీయ పోటీబిడ్డింగ్ ద్వారా మళ్లీ కేటాయించి ఖజానాకు వచ్చిన నష్టాన్ని భర్తీ చేయాలి. అప్పనంగా వచ్చిన లాభాలపై విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ పన్నును విధించి, అటువంటి అవినీతి కలాపాలు మళ్లీ జరగకుండా సరైన చట్టాన్ని అమలు చేయాలి.

# పదవుల పైరవీలు తప్ప రైతు ఘోష పట్టని నేతలు

## మెదక్‌జిల్లాలో వరిపంటను తగలబెట్టుకున్న ఆదర్శ రైతును పరామర్శించిన లోక్‌సత్తా నేతలు

సకాలంలో కూలీలు దొరక్క, చివరకు యంత్రంతో కోత చేయటానికి సిద్ధపడినా సరైన రోడ్డు సదుపాయం కూడా లేకపోవటంతో దిక్కుతోచని స్థితిలో మెదక్ జిల్లా హత్నూర మండలం నవాబ్‌పేట గ్రామంలోని తన మూడెకరాల వరిపంటను తగులబెట్టుకున్న 'ఆదర్శరైతు' కంకర మల్లేశంను లోక్‌సత్తా రాష్ట్ర నేతలు జి.రాజారెడ్డి, బండారు రామ్మోహనరావు పరామర్శించారు. రైతు తగలబెట్టుకున్న పొలాన్ని పరిశీలించారు. కన్నీళ్లతో ఆత్మహత్యకు సిద్ధపడిన ఆ చిన్న రైతు ఘోష, అధికార క్రీడలో బిజీగా ఉన్న ప్రభుత్వ పెద్దలకు విన్పించటంలేదు. ఆ రైతును కనీసం గ్రామసర్పంచ్ సహా ప్రజాప్రతినిధులెవరూ ఇంతవరకూ పరామర్శించలేదు. ఆ నియోజకవర్గం (నర్సాపూర్) ఎమ్మెల్యే, తాజా మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి హైదరాబాద్‌లో మంత్రిపదవి పైరవీల్లో మునిగిపోయారు. కనీసం తిరిగి మంత్రి పదవి వచ్చిన తరువాతనైనా పరామర్శించలేదు. ఆ రైతు దుస్థితి హృదయవిదారకంగా ఉంది. ఎకరాకు రూ.20,000 ఖర్చు పెట్టి పండించిన పంటను చేతులారా తగలబెట్టడాన్ని ఇప్పటికీ రైతు తట్టుకోలేకపోతున్నారు. పరామర్శకు వచ్చిన ప్రతివారి కాళ్ల మీద పడి ఆ రైతు విలపిస్తున్న తీరు కలచివేస్తోంది.

ప్రభుత్వం రైతుల్ని కేవలం ఓటుబ్యాంకులుగానే చూస్తోంది. అమలు చేసే పథకాలలో కూడా వారిని ఆదుకుందామన్న సదుద్దేశం లేదు. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ పనుల్ని చేర్చకపోవటం వల్ల కూలీల కొరత ఏర్పడి మల్లేశం లాంటి బక్కరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నవాబ్‌పేటలో కాస్త డబ్బున్న రైతులు పక్కజిల్లాల నుంచి కూలీల్ని ఎక్కువ రేటు ఇచ్చి తెప్పించుకోగలిగారు. పెట్టుబడికే అవస్థలు పడ్డ మల్లేశం అంత డబ్బు ఇచ్చుకోలేక సకాలంలో పంటను కోయించుకోలేక తీవ్రంగా నష్టపోయాడు. ఉపాధి హామీలో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా పొలాలకు రోడ్డును బాగుచేయించలేదు. ఆ రోడ్డు సక్రమంగా ఉంటే యంత్రాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉండి లాభంరాకపోయినా కనీసం పంటను కోయించుకోగలిగానన్న తృప్తి ఆ రైతుకు మిగిలేది. ఇద్దరు పిల్లలకు పెళ్ళిళ్ళు చేసిన ఆ రైతు పంటను తగలబెట్టాక ఇప్పుడు 8వ తరగతిలో ఉన్న కొడుకును, ఇంటర్మీడియెట్ చదువుతున్న కూతురిని కాలేజీ మాన్పించి కూలీకి పంపుతున్నాడు. ఆదర్శరైతును తానే ఎంపిక చేసిన అన్నదాతను కూలీగా మార్చిన దుర్మార్గం ఈ ప్రభుత్వానిదే. బీమా గురించి కనీస అవగాహన కల్పించాల్సిన వ్యవసాయాధికారులు ఆ బాధ్యతను విస్మరించి, ఇప్పుడు రూల్స్ మాట్లాడుతూ బీమా లేదు, నువ్వే తగలబెట్టుకున్నావు కాబట్టి పైసా పరిహారం రాదని తేల్చిచెబుతున్నారు. భూముల కేటాయింపులో, సబ్సిడీలలో ప్రత్యేక అధికారాలు వినియోగించే ఎమ్మెల్యేలు, మంత్రులు ఈ విషయంలో కనీసం స్పందించటంలేదు.

పంట దిగుబడి సమయంలో సంక్షోభానికి మాత్రమే నవాబ్‌పేట ఘటన అద్దం పడుతోంది. మంచి దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేక పలుజిల్లాల్లో వరి రైతులు అల్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తన అంతర్గత సంక్షోభాన్ని రాష్ట్రం నెత్తిన రుద్దకుండా ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, పంటనష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి.

### శాసన సభ దృష్టికి తీసుకెళ్ళేలా చూస్తాం

నవాబుపేట గ్రామానికి చెందిన కంకర మల్లేశం అనే రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని లోక్‌సత్తా బృందం సభ్యులు తెలిపారు. అదే విధంగా లోక్‌సత్తా పార్టీ అధినేత ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్ ద్వారా శాసన సభలో లేవనెత్తేలా చూస్తామని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు యాదవరెడ్డి, కార్యదర్శి సుధీర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ◆

---

## 2జి స్పెక్ట్రమ్‌లో అవినీతి కుంభకోణం విలువ

# 1.76 లక్షల కోట్లు ఎలా అంటే

1. 2001లో మొబైల్ కనెక్షన్లు – 4 మిలియన్లు 2002 లో మొబైల్ కనెక్షన్లు 350 మిలియన్లు
2. 122 కొత్త లైసెన్సులు 2001 లెక్కల ప్రకారం 2008లో ఇచ్చారు. (నోటిఫికేషన్ 2008 అయినా కూడా)
3. 2008 2జి విలువల ఆధారంగా మార్కెట్లో విలువల లెక్క కడితే టెలికాం డిపార్ట్‌మెంట్‌కి 1,11,511 వచ్చి వుండేది (వచ్చింది 9,012 కోట్లు మాత్రమే) అలాగే డ్యూయెల్ టెక్నాలజీ కింద ఇచ్చిన లైసెన్సులకు 40,526 కోట్లు వచ్చి వుండేవి. (ఇప్పుడు వచ్చింది 3,372 కోట్లు మాత్రమే) రెండూ కలిపితే మొత్తం తేడా 139653 కోట్లు
4. ఇవి కాకుండా పాత 9 కంపెనీలకు 2001 ప్రకారమే స్పెక్ట్రమ్ కూడా పెంచారు. దీనివల్ల 36,729 కోట్లు నష్టం వచ్చింది.
5. నం.3 , నం 4 కలిపితే 2జి స్పెక్ట్రమ్ మొత్తం నష్టం 1,76,372 కోట్లు.




# సర్వజన సత్తా

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండల పరిధిలోని 40 గ్రామాలలో లోక్‌సత్తా పార్టీ అనుబంధ విభాగం సర్వజన సత్తా ఎస్.సి. ఎస్.టి. బి.సి మైనార్టీలను కలుసుకొని వారి జీవన స్థితి గతులను, పరిస్థితులను అడిగి తెలుసుకోవడం జరిగింది.

గ్రామాలలో 90 శాతం సరైన రోడ్లు, వీధి దీపాలు లేవు. బస్సు సౌకర్యం అంతంత మాత్రమే వున్నది. యస్.సి.,యస్.టి.లు నివసించే గ్రామాలలో పూర్తిగా పారిశుధ్యం లోపించింది. 90 శాతం ప్రజలు కూలి పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రభుత్వం మిగులు భూములు పంపకం చేపట్టినప్పటికీ కేటాయించిన భూములు సాగుకు అనువైన పరిస్థితులు లేవు. మాల, మాదిగ, యానాదులకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టినప్పటికి ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు.

1. పేద ప్రజలకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకం దేశ వ్యాప్తంగా ప్రవేశపెట్టనప్పటికి పూతలపట్టు మండలానికి 2010-2011 కాలానికి 1457 పనులు కేటాయించి 28.53 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఇందులో 26 పనులనే పూర్తి చేయగా ఇంకా కొనసాగుతున్న పనులు 1431 మిగిలినవి. మొత్తం లబ్ధి పొందుతున్న జాబ్‌కార్డు సభ్యులు 11186 ప్రస్తుతం ఆ పనులు నిలిపి వేసియున్నారు. అక్కడక్కడ అవినీతి జరుగుతున్నట్లు ప్రజలు చెప్తున్నారు.

2. ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల నిర్మాణ పథకం 70 శాతం అమలు చేసినప్పటికి మిగిలిన 30 శాతం గృహాలు నిర్మాణ దశలోనే వున్నవి. మండలంలో 8-10-2010 నాటికి 3424 గృహాలు పూర్తి చేశారు. 2077 గృహాలు నిర్మించవలసిన అవసరం వున్నది. గృహ నిర్మాణ శాఖ కేటాయించిన నిధులు 11.79 కోట్లు వున్నప్పటికీ అధికారులు అర్హులైన లబ్ధిదారులకు సత్వరం కేటాయించి రాజకీయ పార్టీలకు అతీతంగా గృహ నిర్మాణాలు చేయవలసి వున్నది.

మండల పరిధిలోని గ్రామాలలో ప్రజలు త్రాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నట్లు మా దృష్టికి వచ్చినది. రైతుల పంట పొలాలకు నీళ్ళు లేవు. వ్యవసాయం మానుకొని భూములను బీళ్ళుగా పెట్టుకొని వున్నారు. జిల్లాలో నీటి పారుదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను లేదా రైతులలో పంటల విధానం గురించి అవగాహన కల్పించి చిరుధాన్యాల పంటలను ప్రోత్సహించవలసిన అవసరం వున్నది.

పాల ఉత్పత్తిదారులకు, చెరుకు ఉత్పత్తిదారులకు, ఇతర పంటలు పండించే రైతులకు గిట్టుబాటు ధరలను ఇవ్వడానికి మరియు యస్.సి., యస్.టి., బి.సి., మైనారిటీలకు, ఆర్థికంగా వెనుకబడిన వారికి పాలు ఇచ్చే పశువులను పశుక్రాంతి పథకం ద్వారా ఇప్పించి వారిని ప్రోత్సహించవలసిన అవసరం వున్నది. రైతులు పండించే పంటలకు ముఖ్యంగా చెరుకు రైతులకు నల్లబెల్లానికి మంచి గిట్టుబాటు ధరను కల్పించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవలసిన అవసరం వున్నది.

పూతలపట్టు మండల కేంద్రంలో, పి.కొత్తకోట గ్రామ పంచాయితీలో వున్న వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలను

రోగులకు అందిస్తున్నప్పటికీ అక్కడ మెరుగైన సదుపాయాలను కల్పించి, కొత్తకోటలో పూర్తి అయిన 30 పడకల ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల పరిధిలోని పాఠశాలలు, ఉపాధ్యాయులు నేటి పరిస్థితులను బట్టి జవాబుదారిగానే వ్యవహరిస్తున్నప్పటికీ తల్లితండ్రులలో పిల్లల విద్య పట్ల ముఖ్యంగా యస్.సి., యస్.టి. కులాలలో అవగాహన కల్పించుటకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. అలాగే మధ్యాహ్న భోజన పథకం కూడా కొనసాగుటకు కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో ఇంకా ఇంగ్లీషు మీడియం బోధనను ప్రవేశపెట్టవలసి వున్నది.

గౌడుగుచింత గ్రామ పంచాయతీ హైస్కూలులో అదనపు గదులు లేక విద్యార్థులు వరండాలలో, చెట్లకింద, ఒకే తరగతి గదిలో జరపవలసిన పరిస్థితి వున్నది. వర్షాకాలంలో పూర్తిగా తడిసి గదులలో నీళ్ళు నిలిచి విద్యార్థులు ఇబ్బందికి గురవుతున్నారు. విద్యాశాఖ వారు వెంటనే అదనపు గదుల నిర్మాణం చేపట్టవలసివున్నది.

వడ్డెర కులాలకు వడ్డెర ఆర్థిక సంస్థ ద్వారా అలాగే యస్.సి., యస్.టి., బి.సి. లకు చదువుకొన్న నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్దిదారులను గుర్తించి ఉపాధి కల్పించాలి.

చవటపల్లి గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు భూమి సర్వే నెం 1336 బి–4లో 72 సెంట్లు ఒక మోతుబరి రైతు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కబ్జా చేశారు. ప్రభుత్వం వెంటనే ఆ భూమిని స్వాధీనపరుచుకొని కమ్యూనిటీ హాల్ నిర్మించాలని స్థానిక యువకులు, గ్రామ పెద్దలు కోరుతున్నారు.

పూతలపట్టు మండలం, వేపనపల్లి గ్రామ పంచాయతీ బూసిపల్లిలో యస్.సి. లకు బంజరు భూములను కేటాయించి డికేటి పట్టాలు ఇచ్చారు. బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేశారు. కాని సదరు భూమిని వారికి స్వాధీనపరచలేదు. ఈ చర్య కేవలం వారిని మభ్యపెట్టడమే కాక ప్రభుత్వ అధికారులు, బ్యాంకు అధికారులు బాధ్యతారహిత చర్యల వలన వారు ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకొన్నప్పటికి ఫలితం లేకున్నదని వాపోయారు.

లోక్‌సత్తా పార్టీ అనుబంధ విభాగం సర్వజన సత్తా పది రోజులు గ్రామ గ్రామాన పర్యటించి పైన తెలిపిన సమస్యలను గుర్తించి నేరుగా ప్రజల కష్టసుఖాలను తెలుసుకొన్నది. పైన తెలిపిన అంశాలు వాస్తవమైనవి. యధార్థమైనవిగా భావించి తక్షణం తగు చర్య తీసుకోవలసినదిగా ఆయా శాఖల సంబంధిత అధికారులకు సూచించవలసినదిగా జిల్లా కలెక్టర్ శ్రీ శేషాద్రికి విజ్ఞాపన చేయడం జరిగింది. ◆

# ప్రభుత్వం ఉందని రుజువు చెయ్యండి

■ **కొత్త సీఎంకు లోక్‌సత్తా శుభాకాంక్షలు - తక్షణ సమస్యల్ని పరిష్కరించండి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు. పరిపాలన స్తంభించటంతో సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న ప్రభుత్వోద్యోగులు, బీడీ కార్మికులు, ఆటోవర్కర్లు తదితర వర్గాల సమస్యల్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించటానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందని, ప్రజల సమస్యలపై తక్షణం స్పందిస్తుందనే భావన కల్పించటంతో ముఖ్యమంత్రి తన తొలి కార్యక్రమాలు ప్రారంభించాలి.

రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్రసంక్షోభంలో ఉన్నారు. ప్రత్యేకించి ధాన్యం రైతులకు రూ.200 బోనస్ ప్రకటనకు, ధాన్యం అమ్ముకోవటానికి మార్కెట్ ఆంక్షల సడలింపునకు చర్యలు తీసుకోవాలి. అవినీతి కుంభకోణాలపై కఠినంగా వ్యవహరించాలి.

కొత్త ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా వ్యవహరించాలి. అందుకు లోక్‌సత్తా పార్టీ పూర్తి సహకారాన్ని అందిస్తుంది.

# సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక కన్వీనర్‌గా శ్రీధర్ నియామకం



**సంగారెడ్డి :** సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా ఎం. శ్రీధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కె. రాజేందర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక కమిటీల ఏర్పాటు చేశామన్నారు. కన్వీనర్‌గా ఎంపికైన శ్రీధర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ చట్టంపై పూర్తి అవగాహన లేదన్నారు. పాలనలో జవాబుదారీతనం కోసం, పారదర్శకత కోసం, సమాచారచట్టం వజ్రాయుధంగా ఉపయోగపడుతుందని, చట్టం అమలుకోసం నియోజకవర్గ స్థాయిలో విస్తృతంగా, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# ఈవేళ రాష్ట్రంలో రాజకీయ అజెండా లోక్‌సత్తాదే... ఆవిర్భావ లక్ష్యసాధనలో ప్రాథమిక విజయం సాధించిన పార్టీ

***జనం చేతికి అధికారం తీసుకెళ్లేందుకు లోక్‌సత్తా చేస్తున్న బృహత్తర పోరాటంలో పునాది విజయాన్ని సాధించినందుకు అభినందనలు తెలుపుతూ, ముమ్ముందు కార్యాచరణకు ఉపయోగపడే రీతిలో ఆ క్రమాన్ని వివరించేందుకు 2011 నూతన సంవత్సర సందర్భంగా ఓ బాధ్యతాయుత పౌరుడు రాసిన బహిరంగ లేఖ...***

*మిత్రులారా!*

కొంతమంది నేతలు, వారి కుటుంబాల చుట్టూ తిరుగుతున్న రాజకీయాన్ని ప్రజల చుట్టూ తిప్పేందుకు, పరిపాలనను పౌరుని కేంద్రంగా అందించేందుకు లోక్‌సత్తా ఉద్యమం ప్రారంభమైంది. 'ప్రజలే ప్రభువులు' నినాదంతో ఆగస్టు 3, 1997లో ఆ ఉద్యమం మొదలైంది. జనం చేతికి అధికారం లక్ష్యాన్ని చాటిచెప్పేలా 'లోక్‌సత్తా' అనే పేరును వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఎంపిక చేశారు. తన విలువైన కెరీర్‌ను, అప్పటికే ప్రజోపయోగకరమైన అనేక జేగీయమాన విజయాలను సాధించి మరెన్నో పదవులను అలంకరించి ఎదిగే అవకాశమున్నా వదులుకుని ఐఏఎస్‌కు రాజీనామా చేసి లోక్‌సత్తా ఉద్యమాన్ని జేపీ స్థాపించారు. ప్రకృతి అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలను ఇచ్చినా, సమాజం సృష్టించిన పుట్టుకతో వివక్ష వల్ల కోట్లాదిమంది మెజారిటీ ప్రజలు శాశ్వత పేదలుగా కొనసాగుతున్నారని, సంపద, అవకాశాలు కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమవుతున్నాయని, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసి అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే కొత్త వ్యవస్థను సృష్టించే మౌలికమార్పు సాధించాలని లోక్‌సత్తా ఉద్యమం పోరాటం ప్రారంభించింది.

రాజకీయాల్లో నేరచరితుల వివరాల్ని వెల్లడించటాన్ని చట్టబద్ధం చేయటం, ఓటరు జాబితాల్లో అక్రమాలను నియంత్రించటం, సమాచారహక్కు చట్టం, సిటిజన్ చార్టర్లు, గ్రామ న్యాయాలయాలు, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, పార్టీ నిధుల చట్టంలో పారదర్శకత, పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కట్టుదిట్టం చేయటం, మంత్రివర్గ సభ్యుల సంఖ్యను రాజ్యాంగబద్ధంగా కుదించటం వంటి అనేక విజయాలను కూడా సాధించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బహుశా భూగోళం మీద ఎక్కడా ఈ స్థాయి కృషి పౌరసమాజం నుంచి జరగలేదు. అయితే రాజకీయం కుళ్లిపోవటం వల్ల చేయాల్సిన కృషిలో, సాధించాల్సిన విజయాల్లో 20–30శాతం మించి సాధించలేకపోతున్నామని తొమ్మిదేళ్ల తర్వాత లోక్‌సత్తా ఉద్యమం గుర్తించింది. రాజకీయాల్లో మౌలిక మార్పు వస్తే తప్ప తామనుకున్న రీతిలో వ్యవస్థ మారదని స్పష్టంగా భావించింది. ప్రతి రాజకీయపార్టీనీ కలిసి లోక్‌సత్తా ఉద్యమ ఎజెండాను, మార్పు అవసరాన్నీ వివరించారు. అందరూ అభినందించారుగానీ, ఆ లక్ష్యాలు ఆచరణ సాధ్యంకావని పెదవి విరిచారు. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలివ్వాలని కోటీ 8లక్షలమందితో భారతదేశంలోనే రికార్డుస్థాయిలో లోక్‌సత్తా సంతకాల సేకరణ చేసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పార్టీల నేతలు తప్పకుండా అధికారాల్ని దిగువస్థాయికి బదిలీ చేస్తామని హామీ ఇచ్చి తర్వాత యథావిధిగా మాటతప్పారు. అధికారాన్ని ప్రజలకు ఇవ్వటానికి ఆ పార్టీలకు ఎంతమాత్రం అంగీకారం కాదని స్పష్టమైంది. నైతిక రాజకీయాలు సాధ్యం కావని ఆ పార్టీలు ప్రజల్ని వంచిస్తున్నాయని తేలిపోయింది. చివరకు తమ ఉద్యమం పోరాడుతున్న లక్ష్యాల్ని సాకారం చేసుకునేందుకు లోక్‌సత్తా ఉద్యమ సంస్థ లోక్‌సత్తా పార్టీగా అక్టోబర్ 2, 2006న ఆవిర్భవించింది. ఆరోజున అన్ని సాంప్రదాయ రాజకీయ పార్టీలూ (సా.రా పార్టీలు) వేళాకోళం చేశాయి. విలువలున్న రాజకీయాలతో ఎలా ముందుకెళ్తారో చూద్దామని మాట్లాడాయి. పార్టీల్లోనే కాదు, చాలామంది ప్రజల్లో కూడా అపనమ్మకం. లోక్‌సత్తా పార్టీలో చేరినవారిలో కూడా నమ్మకం కుదరలేదు. కానీ పార్టీ విధానాల పట్ల, నాయకత్వం పట్ల విశ్వాసంతో వచ్చి చేరారు.

అయితే లోక్‌సత్తా ఉద్యమసంస్థలో హుషారుగా పనిచేసి, అదే ఊపులో వచ్చి లోక్‌సత్తా పార్టీ సభ్యత్వం తీసుకున్నవారిలో చాలామంది కొత్త సంక్లిష్ట కార్యాచరణ ధాటికి వెనక్కి తగ్గారు. ఉద్యమసంస్థకు చేసినస్థాయిలో సమయం, శక్తిసామర్థ్యాలు ఇస్తే చాలదు, రాజకీయ పార్టీకున్న పతికూలతల్ని, శత్రుత్వ ధోరణుల్ని, కఠినపరీక్షల్ని ఎదుర్కొని ప్రతిరోజూ పనిచేయాల్సి ఉంటుందని గ్రహించాక వారు క్రమంగా తమ భాగస్వామ్యాన్ని వార్తాపత్రికలు చదివే, టీవీ ఛానళ్లు చూసే స్థాయికి తగ్గించుకున్నారు. కొంతమంది సొంతపనులకే పరిమితమయ్యారు. లోక్‌సత్తా లాంటి కృషి మరెవ్వరూ చేస్తుండకపోవటంతో, మిగిలినపార్టీలన్నీ ఒకపక్కన–లోక్‌సత్తా ఒక్కటే ఒక పక్కన ఉండటంతో, కొత్తగా బాట వేసుకుని ముందుకెళ్లటం వారికి కష్టంగా మారింది. వారి చిత్తశుద్ధిలో ఎటువంటి లోపం లేకపోయినా పార్టీ అవసరానికి తగ్గ నాయకత్వ లక్షణాల్ని సంతరించుకోవటం అంత త్వరగా చేయలేకపోవటం వారి పాత్రను పరిమితం చేసింది.

కొద్దిమంది మాత్రం ముందూవెనకలు చూసుకోకుండా పనిచేస్తున్నవారు కృషిని కొనసాగిస్తున్నారు. ఎన్నికల సమయంలో పార్టీ ఆహ్వానం మేర కొంతమంది వచ్చి చేరారు. ఎంతమంది

స్తబ్దుగా ఉన్నా లోక్‌సత్తా పార్టీలోకి వచ్చి చేరేవారి సంఖ్య ప్రజల్లో ఆ పార్టీ పట్ల అభిమానం మాత్రం పెరుగుతూనే ఉంది. 2009 శాసనసభ, లోక్‌సభ, జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత లోక్‌సత్తాకు జనాదరణ పెరిగిందని ఏ సర్వే చేసుకున్నా తెలుతుంది. ఎన్నో ఒడిదుడుకుల మధ్య లోక్‌సత్తా పార్టీ తన ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లింది. మీడియా యాజమాన్యాలు అంతంత మాత్రంగానే సహకరించినా జర్నలిస్టుల్లో చాలామంది లోక్‌సత్తాకు కొంతమేర అండగా నిలిచారు. ప్రజలు కూడా తమ నుంచి లోక్‌సత్తా పార్టీకి కావలసిన నాయకత్వాన్ని అందివ్వలేకపోయినా పార్టీ సంస్థాగత బలహీనతల్ని అర్థం చేసుకుని పార్టీ పట్ల అభిమానంతోనే వ్యవహరిస్తున్నారు. వీటితోపాటు కొంతమంది అంకితభావంతో కూడిన కృషి, జేపీ మొక్కవోని పోరాటం వల్ల లోక్‌సత్తా పార్టీ నిలకడగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి నూటికి నూరుశాతం తన భావజాలాన్ని తీసుకెళ్లింది. కొత్త రాష్ట్రాలకూ వ్యాపించింది. దానికి సాంకేతిక పరిజ్ఞానం తోడు కావటం వల్ల రాష్ట్రంలో, దేశంలోనేకాక విదేశాల్లో కూడా లోక్‌సత్తా ప్రభావం కన్పిస్తోంది.

హేతుబద్ధంగా అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే విధానాలు, వారసత్వ రాజకీయాలు లేకుండా సామాన్యులకు సైతం పార్టీలో ఎదిగే అవకాశం కల్పించటం లోక్‌సత్తాలో మాత్రమే ఉన్నాయని ప్రజలు గుర్తించారు. ఏ సమస్య వచ్చినా సంకుచిత, స్వార్థ ప్రయోజనాలు లేకుండా ప్రజల పక్షాన, హేతుబద్ధంగా చెప్పేది లోక్‌సత్తా మాత్రమేనని ఫ్రీజోన్ వివాదం, 2-జీ స్పెక్ట్రం కుంభకోణం వరకూ అందరికీ అర్థమైంది. ప్రపంచ చరిత్రలోనే ఈ అతిపెద్ద కుంభకోణంపై అన్ని పార్టీలూ రాజకీయ కోణంలో, సంయుక్త పార్లమెంటరీ సంఘం ఏర్పాటు, రాజీనామాలు అంటూ రాజకీయ కోణంలో పోరాడితే... లోక్‌సత్తా మాత్రం లైసెన్సుల్ని రద్దుచేసి దోషుల్ని శిక్షించటంతోపాటు పోయిన డబ్బును తిరిగి రాబట్టి, ఇక ముందు అటువంటివి జరగకుండా స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి వ్యతిరేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రచారోద్యమాన్ని చేపట్టింది.

ఇలా 2010 సంవత్సరం చివరికొచ్చేసరికి రాష్ట్ర రాజకీయాలలో లోక్‌సత్తా ఎజెండాయే ప్రధాన ఎజెండాగా మారింది. ఉద్యమసంస్థగా లోక్‌సత్తా చెప్పిన ఎజెండాను తిరస్కరించిన రాజకీయ పార్టీలన్నీ ఈవేళ తప్పనిసరిగా పార్టీగా లోక్‌సత్తా చెప్పిన అదే ఎజెండాను ఉచ్చరిస్తున్నాయి. ఆ ఎజెండా అమలుకు ఆయా పార్టీల చిత్తశుద్ధి ఎంతనేది వేరే విషయం. అవినీతి నిర్మూలన, అధికార వికేంద్రీకరణ, న్యాయసంస్కరణలు, విద్య, ఆరోగ్యం, రైతుకు గిట్టుబాటు ధరతో ఆగకుండా వ్యవసాయాన్ని లాభసాటి చేయటం, గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గించటం, మద్యనియంత్రణ, ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచటాన్ని నిరోధించటం, దామాషా ఎన్నికల వ్యవస్థ తదితర అంశాలే ముందుండు ఎన్నికల ఎజెండాకానున్నాయి. పార్టీల నిధుల సేకరణ, బహిరంగచర్చ ప్రమాణాలు పెంచటం, వారసత్వ రాజకీయాలకు అడ్డుకట్ట వేయటం, సార్వత్రిక బంద్‌లు వంటి ఆందోళనాపద్ధతులు కాకుండా రాజ్యాంగబద్ధ ప్రత్యామ్నాయాలతో పోరాడటం వంటి లోక్‌సత్తా లేవనెత్తిన అంశాలు కూడా రాజకీయ పార్టీలు ఆచరించాల్సిన పరిస్థితి క్రమంగా వస్తోంది. అంబుడ్స్‌మన్, సాంప్రదాయ రాజకీయ పార్టీలు, ఆటగాళ్లను కాదు ఆటనియమాలను మార్చాలి వంటి లోక్‌సత్తా పదాల్ని ఈవేళ అన్నిపార్టీలూ ఉచ్చరిస్తున్నాయి.

పార్టీగా ఆవిర్భవించిన లక్ష్యాన్ని సాధించటంలో లోక్‌సత్తా ప్రాథమికంగా విజయం సాధించింది. పార్టీల మధ్య అధికార క్రీడగా ఉన్న రాజకీయాన్ని... పార్టీలు వర్సెస్ ప్రజలుగా మలచటంలో లోక్‌సత్తా ఘనవిజయం సాధించింది. ప్రజలను అనుచరులుగా కాకుండా వారి శక్తిని వారికి తెలియచేసింది. లోక్‌సత్తా తెచ్చిన ఈ మార్పు ఎంతకాలానికి ఎన్నికల ఫలితాలనివొచ్చు అనేది ఇప్పుడే చెప్పలేంకానీ, ప్రజల చుట్టూ తిరిగే కొత్త రాజకీయానికి, వ్యవస్థలో ఓ మౌలికమార్పునకు గట్టి పునాది మాత్రం పడిందని ఖచ్చితంగా చెప్పొచ్చు.

ఆ పునాది మీద మీ లక్ష్యసౌధాన్ని నిర్మించాల్సుంది, ప్రజాదరణను ఓట్ల రూపంలో మలచుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో లోక్‌సత్తాకు కావలసింది లోకల్ ఛాంపియన్స్. స్థానికంగా ఎక్కడికక్కడ నాయకులు. భక్తుడికి దేవాలయాలు, నాయకులకు పదవులు అక్కర్లేదు. ప్రజలకు అధికారం అందించేందుకు ఆ ప్రజల్లో ఒకరిగా బాధ్యత తీసుకోండి. చుట్టూ వేలాదిమందిని సమీకరించండి అని లోక్‌సత్తా కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నా. ఇతర పార్టీలలోని సానుకూల నేతలను, కార్యకర్తలనూ కూడా కలుపుకోండి. మీడియా ప్రతికూలంగా ఉన్నా ఆందోళన చెందవద్దు. నెగెటివ్ ధోరణుల్ని మాని, పౌరసేవా కేంద్రాలు, హుందాగా, వినూత్నంగా, నిర్మాణాత్మకంగా ఉండే ఇతర ప్రయోజనకర కార్యక్రమాలతో సృజనాత్మకంగా లోక్‌సత్తా మోడల్‌లో ప్రజల్లోకి వెళ్లండి. లోక్‌సత్తా ద్వారా కృషి చేయటాన్ని మించి ఈ సమాజానికి మీరు చేసే సేవ ఇంకోటి లేదు, మీరు దేవుడ్ని నమ్మితే లోక్‌సత్తాకు కృషిని మించిన దైవారాధన లేదు, కాబట్టి లోక్‌సత్తా విధానాలను మనసారా విశ్వసిస్తూ చేయాల్సిన పనిని ప్రతిరోజూ సృజనాత్మకంగా చేస్తుంటే మీరు ప్రజల్లోకి తేలిగ్గా దూసుకెళ్లి లక్ష్యాన్ని సాధించగలుగుతారు. అలా దూసుకెళ్లేవారికి ఏ మీడియా అక్కర్లేదు. మీడియానే మీ వెనక వస్తుంది. అలా కలిసిరావటం మీ బాధ్యత అని మీడియాను, యువతను, ఆలోచనాపరుల్ని, పౌరసమాజాన్ని కూడా ఓ పౌరునిగా డిమాండ్ చేస్తున్నా.

'నినాదాలను కాకుండా పార్టీల విధానాలను చూడండి, పార్టీ సంస్కృతిని చూడండి, అమలు చేసే వ్యక్తుల నేపథ్యాన్ని పరిశీలించండి... అప్పుడు ఓటు వేయండి, తప్పక ఓటువేయండి' అని ప్రణాళికాబద్ధంగా, నిబద్ధతతో లోక్‌సత్తా భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ కృషి చేసే సత్తా మీకుంటే విజయం తథ్యం. అందుకు కావలసిన అనుకూల వాతావరణం రాష్ట్రంలో నెలకొంది. దీన్ని దేశవ్యాప్తం చేయగల సానుకూల పరిస్థితులూ నెలకొంటున్నాయి.

**2011- నూతన సంవత్సర శుభాకాంక్షలతో,** ◆




# రాష్ట్ర మహిళాసత్తా సమావేశం

**(జిల్లాలలో మహిళాసత్తా తక్షణం చేపట్టవలసిన కార్యక్రమాలపై చర్చ)**

డిసెంబర్ 3వ తేదీన ఉ॥ 11.00 గం॥ ల నుండి సా॥ 6.00 గం॥ ల వరకు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర మహిళాసత్తా అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి అధ్యక్షతన జిల్లాల మహిళాసత్తా అధ్యక్ష, కార్యదర్శులు, తదితర మహిళా సభ్యులతో రాష్ట్ర సమావేశం జరిగింది.

ప్రధానంగా ఈ సమావేశంలో క్రింది ఎజెండా అంశాలను గూర్చి వివరంగా చర్చించడం జరిగింది.

**ఎజెండా :**

1. అన్ని జిల్లాలో మహిళా సత్తా సంస్థాగత నిర్మాణం
2. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల నిమిత్తం సభ్యత్వనమోదు కార్యక్రమం
3. మున్సిపాలిటీలలో మహిళాసత్తా కమిటీల ఏర్పాటు
4. సూక్ష్మఋణాల పై మహిళలంతా అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం
5. లోక్‌సత్తా ప్రస్తుతం చేపడుతున్న రైతు సమస్యల ఉద్యమంలో, మహిళాసత్తా నిర్వహించవలసిన పాత్రపై చర్చ
6. జిల్లాల మహిళాసత్తా ఇంచార్జీలు చేపట్టవలసిన బాధ్యతలు

పై అంశాల విషయంలో జిల్లాల నుండి వచ్చిన వారి అభిప్రాయాలు తెలుసుకొంటూ ఎన్. సరోజాదేవి, కె. గీతామూర్తి వాటిపై స్పందిస్తూ కూలంకషంగా చర్చించారు. మున్సిపాలిటీలలో మహిళాసత్తా కమిటీలను ఏర్పాటు చేయుటకు జిల్లాలలోని కొంత మంది మహిళలకు ఆ బాధ్యతలను అప్పగించడం జరిగింది.

ముఖ్య అతిథిగా పాల్గొన్న లోక్‌సత్తా పార్టీ అధినేత డా॥ జయప్రకాష్ నారాయణ గారు వ్యవసాయానికి, రైతులకు సంబంధించిన సమస్యల గురించి మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు కూడా ఆ సమస్యల పట్ల స్పందించి ఆ కార్యక్రమాలను చేపట్టవలసిందిగా సూచించడం జరిగింది. మహిళాసత్తా ఉపాధ్యక్షురాలు యస్. మనోరమ కూడా రైతు సమస్యల పట్ల తమ అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా వ్యవహరించిన మహిళా సత్తా సలహాదారు పాండురంగారావు గారు అడ్మినిస్ట్రేషన్ కో- ఆర్డినేటర్ భాస్కరరావుగారు, రాష్ట్ర లోక్‌సత్తా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ బాలాజీ పై ఎజెండాలోని ముఖ్య అంశాలను గురించి వివరించారు.

**ఈ సమావేశంలో పాల్గొన్న వారు:**

రాష్ట్ర మహిళాసత్తా అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి, ప్రధాన కార్యదర్శి కె. గీతామూర్తి, ఉపాధ్యక్షులు ఎమ్. మహాలక్ష్మి, యస్.మనోరమ, కె. నాగమణి, కోశాధికారి ఓగేటి శ్రీదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. శైలజ, వై.వి. రమణి, జాయింట్ సెక్రటరీ ఎ. వెంకటేశ్వరీ, జిహెచ్ఎమ్‌సి మహిళాసత్తా కార్యదర్శి యస్.వి. గజానని, ఎ. విమలాదేవి

**జిల్లాల నుండి పాల్గొన్నవారు :**

**మహిళాసత్తా :** తూ.గో.జి. కాకినాడ నగరశాఖ అధ్యక్షురాలు ఎ.లీలా సావిత్రిదేవి, డా॥ వసంత, కృష్ణాజిల్లా మహిళా సత్తా ఉపాధ్యక్షురాలు పి. సరళకుమారి, కార్యదర్శి వి. శ్రీదేవి, కర్నూల్ జిల్లా మహిళా సత్తా అధ్యక్షురాలు జి. రాజ్యలక్ష్మి, కడప జిల్లా మ.స. అధ్యక్షురాలు వి. విజయమ్మ, ఎన్. సరస్వతి, ప్రకాశం జిల్లా నుండి మ.స. కార్యదర్శి ఎమ్. మాధవి, అనంతపురం జిల్లా మ.స. అధ్యక్షురాలు ఎ. సరస్వతి, కార్యదర్శి సత్తెమ్మ, నల్గొండ జిల్లా మ.స. అధ్యక్షురాలు, సిహెచ్. శంకరమ్మ, సత్యవతి, విజయనగరం జిల్లా మ.స. అధికార ప్రతినిధి ఐ. అనంతలక్ష్మి, విజయనగరం నెల్లిమర్ల నియోజకవర్గం మ.స. అధ్యక్షురాలు ఆర్. పద్మావతి, గుంటూరు జిల్లా మ.స. అధ్యక్షురాలు లలితకుమారి, కె.యస్. వాణి ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా టైమ్స్ వర్కింగ్ ఎడిటర్ గంగాధర రావు, సర్వజన సత్తా అధ్యక్షులు చెన్నయ్య కూడా పాల్గొన్నారు.

**ముగింపు:** రాష్ట్ర మహిళాసత్తా సమావేశాలను తరచు నిర్వహించుకొంటు జిల్లాలో జరుగుతున్న, జరగబోయే కార్యక్రమాలను పునఃసమీక్షించుకొంటూ లోక్‌సత్తాకి ప్రజాసంఘంగా వున్నటువంటి మహిళాసత్తా పార్టీని విజయం దిశగా తీసుకెళ్ళటానికి తనవంతు కృషి చేయాలని నిర్ణయించింది.◆




# మహిళాసత్తా

## రైతులు వేదికలు ఏర్పాటు చేసుకోవాలి

**సిద్ధిపేట:** రైతులు సంఘటితమై గ్రామాల వారీగా వేదికలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మారెడ్డి హన్మంతరెడ్డి కోరారు. నవంబరు 23న స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రచురించిన 'ధాన్యం రైతులు పోరుబాట పట్టాలి' కరపత్రాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. రైతులు సంఘటితమైనపుడే సమస్యలు పరిష్కారమౌతాయన్నారు.

లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు మాట్లాడుతూ రైతులు ఏకతాటిపైకి రాకపోతే రాజకీయాలకు బలవుతారని చెప్పారు. స్వాతంత్ర సమరయోధుడు వంగ గాల్‌రెడ్డి మాట్లాడుతూ నటులు సినిమాల్లో నటిస్తే రాజకీయ నాయకులు ప్రజల మధ్య నటిస్తున్నారని విమర్శించారు. నాయకులు నటనలు మాని రైతుల శ్రేయస్సు కోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో యాదగిరి, రాజసింహారెడ్డి, ప్రకాష్, సురేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం పై చిన్నచూపు : లోక్‌సత్తా

**కొండపాక :** రైతుల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని లోక్‌సత్తా రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, జిల్లా పరిశీలకులు ఎన్. సరోజాదేవి అన్నారు. కొండపాక మండలంలోని వివిధ గ్రామాలలో నవంబరు 24న లోక్‌సత్తా జిల్లా పార్టీ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్‌తో కలిసి తన బృందంతో పర్యటించి రైతులతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా రైతులు ఏకం కావాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామాలలో రైతు వేదికలు ఏర్పాటు చేసుకోవాలని, దీర్ఘకాలికంగా వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని, ధాన్యం రైతులు పోరుబాట పట్టాలని ఆమె సూచించారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్కో ఎకరంలో రైతు రూ.20 వేలు ఖర్చుపెట్టినా కనీసం రూ. 10 వేలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. వేల కోట్లతో మార్కెట్ యార్డు నిర్మించినా వాటిని సద్వినియోగం చేసుకునేలా వసతులు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.1030 ఉన్నప్పటికి దళారులు మాత్రం రూ. 850 కే కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు విలవిలలాడుతుంటే ప్రభుత్వం కిమ్మనకుండా ఉంటోందని విమర్శించారు. కుకునూరుపల్లి, కొండపాక, దుద్దెడ, మర్పడ్గ సిరిసినగండ్ల తిమ్మారెడ్డిపల్లిలో వారు రైతులను సంఘటితం చేసి వారితో మాట్లాడి గ్రామ వేదికలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, నగేశ్, రాజు, యాదగిరి, శ్రీనివాస్, డాక్టర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

## రైతులంతా ఒక్కటై ప్రభుత్వాన్ని నిలదీయాలి

**సిద్ధిపేట :** రైతులంతా ఒక్కటై ప్రభుత్వాన్ని నిలదీయాలని రాష్ట్ర మహిళా సత్తా అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి కోరారు. లోక్‌సత్తా పార్టీ, రైతు ఐక్యతాయాత్ర నిర్వహణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌లో నవంబర్ 30న ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆమె మాట్లాడారు. పంటలవారిగా రైతులను విడదీసి ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. రైతులపక్షాన పోరాడటానికి లోక్‌సత్తా పార్టీ సిద్దంగా ఉందన్నారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారం కోసం పార్టీ కృషి చేస్తున్నదన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రైతుసంఘాల జిల్లా సమాఖ్య అధక్ష్యుడు మారెడ్డి హన్మంతరెడ్డి, రైతు సంఘాల సమాఖ్య జిల్లా సలహాదారు జె.రామచందర్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు గడీల భైరవరెడ్డి, చిట్టి వెంకట్‌రెడ్డి, రామలింగారెడ్డి, రాజేశం, గాలిరెడ్డి, శంకరవ్వ, సుగుణ, భాగ్య, చంద్రకళ, రామచంద్రారెడ్డి, నగేశ్, మహేశ్, యాదగిరి, కనకవ్వ, ప్రకాశ్, దేశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.



# తరతరాల దళారీల దోపిడి

పి. జగన్నాథం నాయుడు

బజారులో బియ్యం ధర కిలో 35 రూపాయలు. అదే బియ్యానికి రైతుకు లభిస్తున్నది 12 రూపాయలు. అదేవిధంగా కిలో వేరుశనగ నూనె 70 రూపాయలు. అందులో రైతుకు లభిస్తున్నది 25 రూపాయలు. చక్కెర బజారులో 60 రూపాయలు. రైతుకు దక్కేది 20 రూపాయలు. మిరపకాయలు కిలోకు 40 రూపాయలు రైతుకు లభిస్తుంటే, దానిని పొడి చేసి కంపెనీలు 130 నుంచి 150 రూపాయలకు అమ్ముతున్నాయి. ఇలా ఏ పంట ఉత్పత్తులయినా, కూరగాయలయినా ఆ చేతినుంచి ఈ చేతికి మారగానే రెండు నుండి మూడు రెట్లు పెరిగిపోతున్నాయి. ఉల్లిపాయలు, టమోటాలు సైతం ఇదే పరిస్థితి. ఒకటి, రెండు రూపాయలు కూడా రైతుకు దక్కని అవి, వినియోగదారునికి చేరగానే 10 నుంచి 15 రూపాయలకు అమ్ముడవుతున్నాయి. ఇలా తరతరాలుగా వేళ్ళూనికునిపోయిన దళారీల వ్యవస్థ రైతాంగాన్ని పీల్చి పిప్పి చేస్తున్నది. రూపాయి వస్తువు ఆరు రూపాయలకు అమ్మడం తమ ధర్మహక్కుగా భావిస్తున్న దళారీలను నియంత్రించే పాలకులే మనకు కరువయ్యారు.

రాత్రనక, పగలనక ఆరుగాలం కష్టించి రక్తాన్ని చెమటగా మార్చి పంట సాగుచేసి, పెట్టుబడులు పెట్టి పండించే పంటకు సీజన్‌లో రేట్లు తగ్గించి కొనడం, ఆ తరువాత తీరికగా ధరలు పెంచి అమ్ముకోవడం దళారీలు ప్రతిసారీ చేసే దోపిడీ. దేశానికి ఆహార భద్రత చేకూర్చే రైతుకు మిగులుతున్నది అప్పులు, అనారోగ్యం, ఆత్మహత్యలు మాత్రమే. ఏ మాత్రం కష్టంతో పని లేకుండా దళారీలు చేతులు మార్చి కోట్లు దండుకుంటున్నారు. ఒక్క దళారీల వ్యవస్థను నియంత్రించగలిగితే ఇటు రైతులకు గిట్టుబాటు ధర అటు వినియోగదారులపై అదనపు భారం పెరిగే పరిస్థితి ఉండదు.

రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తే వినియోగదారులపై భారం పడుతుందంటూ పదేపదే కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అయితే మార్కెట్లో ధరలు ఆకాశంలో ఉండటానికి, గిట్టుబాటు ధరలు రైతులకు లభించకపోవడానికి ప్రధాన కారకులు దళారీల సామ్రాజ్యమనే వాస్తవాన్ని ఇటు రాజకీయనాయకులు అటు పాలకులు గుర్తించకపోవడం గమనార్హం.

ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, రాత్రింబవళ్ళు కష్టపడి, పెట్టుబడులు పెట్టి, సాగు ఖర్చులు భరించి రైతులకు పంట చేతికి వచ్చే సమయానికి వ్యాపారులు, దళారీలు కుమ్మక్కయి ధరలు తగ్గించి కొనడం, తిరిగి అదే ఉత్పత్తులను రెండు మూడు రెట్లు అధికం చేసి వినియోగదారునికి విక్రయించడం యథాలాపంగా జరిగిపోతున్నది. రైతులకు ధర గిట్టుబాటు అయ్యేవిధంగా రాష్ట్రంలోని మార్కెట్ యార్డులు ప్రధాన భూమిక పోషించాలి. రైతుకు గిట్టుబాటయ్యే ధరలతో మార్కెట్ యార్డులు బహిరంగంగా ఆక్షన్ నిర్వహించాలి. లేదంటే మార్కెట్ యార్డులే కొనుగోలు చేసి నిల్వ ఉంచి ధర బాగా పలికినప్పుడు అమ్మకాలు సాగించి రైతు శ్రేయస్సును కాపాడాలి. అయితే ప్రభుత్వ మార్కెట్ యార్డులు, గిడ్డంగులలో అలాంటి కార్యక్రమాలు సాగడం లేదు. రాష్ట్రంలో 300 మార్కెట్ యార్డులు ఉంటే ఒక్కదానిలోను ఎలక్ట్రానిక్ తూకం యాంత్రాలు పనిచేయడం లేదంటే మోసం ఏ స్థాయిలో జరుగుతున్నదో సులభంగా అర్థమవుతోంది. దళారీలు తూకాలు పేరిట, తరుగు పేరిట, ధరల పేరిట అన్నింటిలోను కోతలు విధించి రైతులను దగా చేస్తున్నారు. అయినా మార్కెట్ యార్డులు పట్టించుకోవు. దాంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోను పండిన పంటను అయినకాడికి అమ్ముకుని రైతు ఇంటిబాట పడుతున్నాడు. కొంతమంది వ్యాపారులు పంటలకు ఎరువుల, క్రిమిసంహారక మందులు, విత్తనాలు, రుణసదుపాయం కల్పించి పంట చేతికి రాగానే అతితక్కువ ధరలకు తీసుకెళ్ళిపోతున్నారు. చేతికి వచ్చిన గిట్టుబాటు ధరలు వచ్చేవరకు వేచి చూసి అమ్ముకునే పరిస్థితి రైతులకు 80 శాతం మందికి ఉండదు. వారి ఆర్థిక అవసరాలకు ఎప్పటికప్పుడు వచ్చిన రేటుకు తెగనమ్ముకుంటారు. అదే అదునుగా దళారీల దోపిడీ సాగుతున్నది. వేరుశనగ, వరి, పెసరలు, కందులు, కూరగాయలు ఏ పంట అయినా సరే పంట దిగుబడి సీజన్‌కు బాగా ధరలు తగ్గిపోవడం, పంట కాస్తా దళారీల చేతకు చేరగానే ధరలుమండిపోవడం అనేది ప్రతి ఏటా సాగుతున్నతంతు. ఇది అందరూ ఎరిగిన సత్యం. అయినా పట్టించుకోరు. రైతుగురించి మాట్లాడరు. వ్యవసాయ రంగం కష్టనష్టాలు గురించి ఎవ్వరికీ పట్టదు. ప్రజాప్రతినిధులయినా, రాజకీయనాయకులయినా, పాలకులయినా, మంత్రులయినా, అధికార పక్షమయినా ప్రతిపక్షమయినా రైతులపట్ల ఒకేరకమైన దృక్పథం కొనసాగుతుంటుంది.

### ఆయా పంటల సీజనులో....

రాష్ట్రంలో ప్రధాన పంటలయిన వరి, వేరుశనగ ఇటు రబీలోను, అటు ఖరీఫ్‌లోను పండిస్తున్న విషయం తెలిసిందే. వరిపంట ప్రతిఏటా 35 నుంచి 45 లక్షల హెక్టార్లు (దాదాపు కోటి ఎకరాలలో) పంట పండిస్తుంటారు. 95 లక్షల టన్నుల నుంచి కోటి లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంటుంది. అదే విధంగా

వేరుశనగ (పల్లి) పంట రెండు సీజన్లలో కలిపి 40 లక్షల ఎకరాలలో వేస్తుంటారు. దిగుబడి 15 లక్షల టన్నుల వరకు వస్తుంటుంది. ఈ సంవత్సరం ఒక్క ఖరీఫ్‌లోనే 15 లక్షల టన్నుల వేరుశనగ పంట దిగుబడి వచ్చింది. వరిపంట ఎకరాకు 25 నుంచి 35 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. (75 కిలోలు బస్తా) అదేవిధంగా వేరుశనగ 40 కిలోల బస్తా చొప్పున 15 నుంచి 25 బస్తాలు ఎకరాకు చొప్పున దిగుబడి ఉంటుంది. ఒక బస్తా ధాన్యం మిల్లులో పట్టిస్తే 75కిలోల బస్తాకు 65 కిలోల వరకు బియ్యం వస్తుందని చెబుతారు. 75కిలోల బస్తా రైతునుంచి 750 రూపాయలకు మిల్లర్లు, దళారులు ధాన్యంను కొంటున్నారు. దానిని బియ్యం చేసి మార్కెట్‌లో మాత్రం కిలో 30 నుంచి 35 రూపాయలకు రకాలను బట్టి అమ్ముతుంటారు. అంటే రైతుకు ఆరునెలల కష్టానికి దక్కేది 11 నుంచి 12 రూపాయలు మాత్రమే. అదేవిధంగా వేరుశనగ పంట చేతికి వచ్చే సమయానికి 40 కిలోల బస్తా 800 నుంచి 900 రూపాయలకు దళారీలు, వ్యాపారులు రైతుల నుంచి కొంటుంటారు. 40 కిలోల బస్తా కాయలు మిల్లులో ఆడిస్తే 30 కిలోల పప్పు వస్తుందని దానిని నూనె పట్టిస్తే 15 నుంచి 20 లీటర్ల నూనె వస్తుందంటారు. రైతుకు లభించే ధర ప్రకారం కిలో కాయలు 20 రూపాయలు కాగా మార్కెట్టులో 65 నుంచి 70 రూపాయలకు అమ్ముతున్నారు.

చెరకు పంట విషయానికి వస్తే రాష్ట్రంలో ఐదు లక్షల ఎకరాల విస్తీర్ణంలో పండుతోంది. ఎకరాకు 30 నుంచి 50 టన్నుల చొప్పున పండే చెరకు రాష్ట్రంలో ఒకటిన్నర కోట్ల టన్నుల నుంచి రెండు కోట్ల టన్నుల మేర దిగుమతి ఉంటున్నది. రాష్ట్రంలో 38 చక్కెర ఫ్యాక్టరీలు ఉన్నాయి. తొమ్మిది శాతం రికవరీకి రైతుకు చెల్లించేది టన్నుకు రెండువేల రూపాయలు, క్వింటాల్ చెరుకు మీద రైతుకు వచ్చేది తొమ్మిది కిలోల చక్కెర. రైతు కిలోకు 20 రూపాయలు ఇచ్చి 40 రూపాయలకు అమ్ముకుంటున్నారు. ఇందులో 500 రూపాయలు చెరుకు పంటకోత కోసిన కూలీలకే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడి ఉంది. చెరకు పంట ఉత్పత్తి ఖర్చులు టన్నుకు 2000 నుంచి 2500 ఖర్చవుతుండగా మద్దతు ధర మాత్రం రెండు వేలరూపాయలు. ఇతర రాష్ట్రాలలో చెరకు పంటకు టన్నుకు 2500 రూపాయల చొప్పున గత ఏడాది చెల్లించారు. గత 50 ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా చెరకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరకు పంట మీద రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్యాక్టరీలు 4500 నుంచి 5000 రూపాయల వరకు ప్రతి టన్నుల మీద సెంట్రల్ ఎక్సైజ్ రూపంలో పొందుతున్నాయి. చెరకు మీద, చక్కెర, ఉప ఉత్పత్తుల మీద టన్నుల రూపంలో ఇంతటి ఆదాయం సమకూరుతున్నా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాల్సి వచ్చేటప్పటికి ఎవ్వరు కనీస సానుభూతిని కూడ కనబరచడం లేదు. బ్రెజిల్, అమెరికాలంటి దేశాలలో 20 శాతం ఎథినాల్‌ను పెట్రోలియం ప్రొడక్ట్‌లో కలిపి వాడుతుండగా మనదేశంలో ఐదుశాతంకు మించడం లేదన్నది. అందరికీ తెలిసిన సత్యమే. మన దేశంలో మరో ఐదుశాతం ఎథనాల్ వాడకాన్ని పెంచితే పెట్రోలియం మీద వెచ్చించే నిధులు ఏటా 1600 నుంచి రెండువేల కోట్లు ఆదా చేయవచ్చు పైగా రైతులకు మరింత ధరను చెల్లించవచ్చు. దేశానికి తిండి గింజలు, పాలు, కూరగాయలు, అందించే రైతు రోజురోజుకు చిక్కి శల్యమైపోతుండగా మధ్య దళారీలు, ప్రభుత్వాలు మాత్రం రైతుల చెమటతో తమ పబ్బం గడుపుకుంటున్నాయి. ◆

## జనం నోట – మనసు మాట

**ఆనాటి రాజకీయ తరానికి వుండేది సేవాదృక్పథం**

**నేటితరం నాయకులలో కన్పించదు అలాంటిదృక్పథం**

**అందుకే ఆ తరం నాయకులు గతించినా ప్రతిమలై మనమధ్య నిల్చిపోయారు**

**ఈతరం నాయకులు పదవులలో వుండి కూడా ప్రజలచే ఛీత్కరించబడుచున్నారు.**

నంద్యాల రామకృష్ణరాజు, పులివెందుల

## జ్ఞానం

నూట పదికోట్ల భారతీయుల జేబుల్లోంచి సగటున 1500 రూ॥ (మొత్తం 1 లక్ష 76 వేల కోట్లు అవినీతి) దోచుకున్న రాజా కేంద్రమంత్రిగా దర్జాగా తప్పుకున్నాడు. ఏ శిక్షా లేదు. తన కంపెనీలో లేని లాభాలు చూపించి ప్రజలను మభ్యపెట్టి మోసపుచ్చానని ఒప్పుకున్న నేరానికి బెయిల్ కూడా లేకుండా సత్యం రామలింగరాజు కటకటాల్లో సాధారణ నేరస్తుల చెంత జీవితం గడుపుతున్నాడు. తప్పు ఒప్పుకోనివాడు దొర. ఒప్పుకున్న వాడు దొంగ. నిజంగా రామలింగరాజు ఎంత అమాయకుడు. ఏ రాజకీయ పార్టీలోనో చేరి వుంటే అందులోని నాయకమ్మన్యులు తనకు ఎన్నోరెట్లు మించిన నేరస్తులని గ్రహించేవాడు. ఈ జీవితకాలంలో కటకటాలను తప్పించుకునే జ్ఞానం అబ్బేది.

# క్షేత్ర పర్యటనలో రాష్ట్ర నాయకులు

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**రాజమండ్రి సిటీ:** ప్రజా సమస్యల పరిష్కారానికి లోక్‌సత్తా కృషి చేస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు తెలిపారు. రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా నవంబర్20న రాజమండ్రిలోని 44,47,49,50 డివిజన్లలో లోక్‌సత్తా బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ప్రజలు శానిటేషన్ అధ్వాన్నంగా ఉందని, మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఓటరు నమోదు సక్రమంగా జరగటం లేదని నాయకులకు విన్నవించారు. లోక్‌సత్తా నిర్వహించిన పర్యటనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. లోక్‌సత్తా జిల్లా ఇన్‌చార్జి గుంటూరి రామరాజు, శిక్షణ నిపుణులు బాణాల చంద్రశేఖర్, రాజమండ్రి నగర శాఖ కన్వీనర్ డాక్టర్ వివి రామారావు, సలహామండలి సభ్యులు డివిఆర్ సూర్యారావు, లోక్‌సత్తా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించండి

**సిద్ధిపేట :** ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం పక్కన పెట్టి ప్రభుత్వం అధికార మార్పిడితో ప్రజల జీవితాలతో ఆడుకుంటుందని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌రావు అన్నారు. నవంబర్ 27న స్థానిక బాలాజీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన 2 రోజుల రాజకీయ నాయకత్వ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అధికార పక్షం పాల్పడుతున్న అవినీతిని ఎప్పటికప్పుడు ఎండగట్టాల్సిన ప్రధాన ప్రతిపక్షం అంతర్గత సమస్యతో సతమతమౌతూ రోజుకో సమస్య, పూటకో ఎజెండాతో ముందుకు పోతుందన్నారు. మున్సిపల్ ఎన్నికలు జరిపి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నారు. లోక్‌సత్తా కార్యకర్తలు, నాయకులకు ప్రజల సమస్యలు అర్థం చేసుకొని వాటి పరిష్కారాలకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాసాప అధ్యక్షుడు చంద్రారెడ్డి, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఐతా చంద్రయ్య, నాయకులు శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, శంకరమ్మ, రాజు, నగేశ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అవినీతిపై లోక్‌సత్తా పార్టీ వినూత్న నిరసన

**సిద్ధిపేట :** దేశంలో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా డిసెంబర్ 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా చలో పోస్టాఫీస్ కార్యక్రమాన్ని లోక్‌సత్తా పార్టీ చేపట్టినట్లు పార్టీ కార్యదర్శి బండారు రామ్మోహన్ రావు తెలిపారు. 2జి స్పెక్ట్రం కుంభకోణం దేశంలో ఇప్పటి వరకు జరిగిన అన్ని కుంభకోణాల కంటే అతి పెద్ద కుంభకోణం అవినీతికి పాల్పడిన వారిని శిక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీని కోసం జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ సారథ్యంలో ప్రారంభించారని తెలిపారు. వెంటనే 2జి స్పెక్ట్రం కాంట్రాక్ట రద్దు చేసి అవినీతికి పాల్పడిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ ప్రధాన మంత్రికి ఓ విజ్ఞాపన పత్రం మరియు ఒక రూపాయి మనియార్డర్ ప్రధాన మంత్రికి పంపుతామని రామ్మోహన్‌రావు తెలిపారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అవినీతి నిరోధక కమీషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## పందులతో సహవాసం - ఆరోగ్యంతో చెలగాటం

**సిద్ధిపేట :** సిద్ధిపేట పట్టణంలోని పేదలు నివసిస్తున్న దళిత మైనార్టీ వాడల్లో పందులు స్వైరవిహారం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకత్వ శిక్షణ శిబిరం రెండవ రోజులో భాగంగా క్షేత్రపర్యటనలో నవంబరు 28న సంజీవయ్యనగర్, అంబేద్కర్ నగర్, సాజిద్‌పుర వీధులలో తమ బృందంతో కలిసి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలతో పాటు నీరు సరిగా రాక, గుంతలు పడిన రోడ్లతో, పందులతో సహవాసం చేస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం పేదలు నివసించే వీధుల పట్ల శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. సిక్కులకు పట్టాలిచ్చి ఇప్పటికీ స్థలాలను స్వాధీనపరచకపోవడం దారుణమన్నారు. వారికి కేటాయించిన స్థలాలను వారికి వెంటనే అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, నగేష్, రాజు, మహేశ్, బి. శ్రీనివాస్, సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**సిద్ధిపేట :** లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక విక్టరీ చౌరస్తా వద్ద పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే ఆశయ సాధనకు అందరు కృషి చేసినప్పుడే సామాజిక మార్పు వస్తుందని అన్నారు. నేటికి దళిత బహుజన వర్గాలకు విద్యలో పించడం వల్ల సామాజిక అసమానతలు పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు, పూలే ఆశయాల సాధన వేదిక ప్రతినిధి చింతమడక రాజన్న, అంజాగౌడ్, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, న్యాయవాది బాపురావు, ఏవ్యా రమేశ్, పిండి యాదగిరి, శ్రీనివాస్, రాజు, రాంచంద్రారెడ్డి, నగేశ్, మహేశ్, బింగి శ్రీనివాస్, విజయ్‌కుమార్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు. ◆

# చట్టాలు చేస్తే మహిళా వేధింపులు తగ్గుతాయా?

యస్. నిర్మల, యూఎస్ బ్యాంక్, అమెరికా

కేంద్రప్రభుత్వం లైంగిక వేధింపుల బిల్లును వచ్చే శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రిమండలి ప్రధాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకుంది. మహిళలు తాము పనిచేసే కార్యాలయాల్లో ఎన్నో రకాల వేధింపులు ఎదుర్కొనవలసి వస్తోంది. అలా అని జీవనాధారమైన ఉద్యోగాలను మానుకోలేరు. ఫిర్యాదు చేయనూలేరు. అవసరం - వేధింపుల మధ్య ఆత్మాభిమానాన్ని చంపుకుని నిస్సహాయస్థితిలో పనిచేస్తున్నారు. మహిళల లైంగిక వేధింపుల బిల్లు ప్రకారం నిబంధనలను అతిక్రమించినట్టు రుజువైతే సంబంధిత కార్యాలయాలు యజమానులు రూ|| 50 వేల జరిమానా చెల్లించాల్సి వుంటుంది. ప్రభుత్వ - ప్రైవేట్, సంఘటిత అసంఘటిత రంగాలకు చెందిన అన్ని సంస్థలకు పనిచేసే ప్రాంతాలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇంతకు ముందే కొన్ని దేశాలలో ఈ లైంగిక వేధింపుల చట్టం అమలు చేయబడుతుంది. మన దేశానికి చెందిన ఇన్ఫోసిస్ కంపెనీ విదేశాలలో ఈ రకమైన లైంగిక వేధింపుల చట్టానికి తలవంచాల్సిన సంఘటనలు జరిగాయి. విదేశీయ మహిళలను లైంగిక పరంగా వేధించినట్టు ఆమె ఫిర్యాదు చేయగా ఇన్ఫోసిస్ కంపెనీ యాజమాన్యం అక్కడి ....లో పెద్ద మొత్తాన్ని నష్ట పరిహారంగా చెల్లించాల్సి వచ్చింది. దురదృష్టం ఏమంటే ఆ నేరం చేసిన వ్యక్తి భారతీయుడే కావడం సిగ్గుపడాల్సిన విషయం.

మహిళలను అసలు ఎందుకు చులకన చేస్తున్నారు? ఆమెను లింగ వివక్షతతో చూడాల్సిన అవసరం ఏముంది? ఆమె మగవారితో సమానంగా ఒకోసారి ఎక్కువగా శ్రద్ధగా అంకితభావంతో పనిచేస్తుంది. మగవారితో బాటు పనిచేసే వ్యక్తిగా సమాన గౌరవ దృష్టితో చూడని సమాజంలో ఎన్నో దారుణాలకు గురి అవుతోంది. జీవనం స్వేచ్ఛలకు సంబంధించి హక్కుల రక్షణకు భరోసా కలిగించే రీతిలో ఈ లైంగిక వేధింపుల చట్టం రూపుదాల్చడం సంతోషకరమని ఒక అధికార ప్రతినిధి హర్షం వెలిబుచ్చారు. 1997 వ సం||లో విశాఖ రాజస్థాన్ ప్రభుత్వం మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు చెప్పిన లైంగిక వేధింపుల వివరాలనే బిల్లులో ప్రతిపాదించారు. అవి ఈ విధంగా వున్నాయి. శారీరకంగా తాకినా, తాకడానికి ప్రయత్నించినా మాటలతో సైగలతో కోరికను వ్యక్తం చేసినా ఇవి లైంగిక వేధింపులే. నోటిమాటగా చెప్పకపోయినంత మాత్రాన తప్పించుకోలేరు. ఉద్యోగానికి సంబంధించి ప్రమోషన్లను ఎరచూపడం, పదవిలో ఉన్నతస్థాయికి సిఫార్స్ చేస్తానని, ఆశచూపడం, తాను చెప్పినట్టు వినకుంటే సమస్యలు చిక్కులు ఎదుర్కొనగలరని హెచ్చరించినా, వేధింపులగానే పరిగణించబడతాయి. కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులకే కాదు కార్యాలయాలకు తమ పనులరీత్యా వచ్చే మహిళ వినియోగదారులకు క్లయింట్లకు రోజువారీ వేతనానికి పనిచేసే మహిళలతో సహా అందరికీ ఈ కొత్తచట్టం వర్తించడమే కాదు ధైర్యాన్ని కలిగిస్తోంది.

కాలేజీల్లో యూనివర్శిటీలలో స్టూడెంట్స్ రీసెర్చి స్కాలర్స్ హాస్పిటల్స్‌లో మహిళా పేషెంట్లను కూడా వేధింపులకు గురి కాబడే వారుగా చేర్చారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిభావంతంగా పనిచేసే ఒక వ్యవస్థను రూపొందిస్తారు. ప్రతీ ఆఫీస్‌లోనూ ఈ ఫిర్యాదులను స్వీకరించే కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంటుంది. జిల్లా తహశీల్ స్థాయిలో ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేస్తారు. చేసిన తప్పును బట్టి శిక్ష నిర్ధారించబడుతుంది. విచారణ సమయంలో మహిళలను బెదిరించకుండా వుండేందుకు ఉద్యోగినులు సెలవు, బదిలీ కోరుకునే వీలు కలుగుతుంది. కాలయాపన విపరీతమైన జాప్యము కలగకుండా 90 రోజుల్లో విచారణ పూర్తి చేస్తారు. 60 రోజుల్లో యాజమాన్యం జిల్లా అధికారి స్థానిక కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాల్సి వుంటుంది. లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు తప్పుడుగా ఎవరైనా ఫిర్యాదులు చేస్తే అందుకు కూడా తగిన జాగ్రత్తలను రూపొందించడం జరిగింది. ప్రతి సంవత్సరం దాఖలైన కేసులను ఎలాంటి చర్య తీసుకున్నారన్న అంశాలను యాజమాన్యాలు నివేదికలను సమర్పించాల్సిన అవసరం ఉంటుంది. ఇంత వివరంగా పకడ్బందీగా చట్టాన్ని నిర్దేశించినప్పటికీ మహిళల ధైర్యంతో ఫిర్యాదులు చేయగలరా? మరోరకంగా ఆధారాలు లేని వేధింపులకు గురి అవుతారా? కాలమే నిర్ణయించాలి. మనదేశ మహిళల్లో విద్య ఉద్యోగార్హతలూ ఉన్నప్పటికీ తోటి ఉద్యోగస్థులు సహకారం కూడా లభించాలి. వారి దృష్టిలో స్త్రీ అనే గౌరవభావం ఇంటిపని ఉద్యోగ బాధ్యత నిర్వహించగలిగే మహిళగా ప్రోత్సహమూ వుండాలి. ఈనాడు ప్రతి ఇంటి కుటుంబ సభ్యులలో మహిళలంతా దాదాపు ఉద్యోగినులే. వారిని మనం గౌరవించినట్టు వారి శక్తి సామర్థ్యాలను గుర్తించినట్టుగా తోటి ఉద్యోగునులను అర్థం చేసుకుంటే మహిళల పట్ల వేధింపులు ఉండవు. చట్టాలు కొంత వరకు మహిళలకు రక్షణ కల్పించినప్పటికీ తోటి ఉద్యోగస్థుల సహాయసహకారాలు కూడా ఉండాల్సిన అవసరం ఉంది. ఆడ మగా తేడా లేని పని సామర్థ్యం కార్యాలయాలను ప్రగతి పథానికి చేర్చడానికి ఎంతో అవసరం కాదనగలరా? ◆

# జేపీ నా విద్యార్థిగా గర్వపడతాను

**- నాదెళ్ల వెంకట గోపాలరావు**

"పుట్టుకతో వివక్ష తొలగి తీరాలి. అందరికీ ఒకే న్యాయం అందరికీ ఒకే అవకాశం అంది తీరాలి." "లోక్‌సత్తా - ఇది మీ సత్తా" యీ స్లోగన్స్‌తో రాజకీయ ప్రచారం చేబట్టిన లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నా విద్యార్థియైనందుకు నేనెంతో గర్వపడతాను. అతనిలో ఆనాటి లోక్‌నారాయణ్ జేపీని, లాల్‌బహదూర్ శాస్త్రిని, రాజేంద్రప్రసాద్ లాంటి మహోన్నత నాయకులను చూస్తాను.

కుటుంబపాలన, వారసత్వ పాలన యీ ప్రజాస్వామ్యములో ఉండకూడదంటాడు. సబ్సీడీలు, బ్యాంకు ఋణాల మాఫీల వంటి తాత్కాలిక ఉపశమనాలతో ప్రజలు సోమరులుగ, బానిసలుగ మారతారంటాడు. ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడే సత్తా రావాలంటాడు. పెక్కు ప్రలోభాలతో ప్రజల్ని మభ్యపెట్టి రాజకీయ నాయకులు వారిని మోసగించుచున్నారని అతని ఆవేదన.

చిన్నప్పటి నుండి జేపీ మహామేధావి గుడ్డిగా ఏ విషయాన్ని నమ్మేవాడు కాదు. వాదించి మరీ గెలిచి నిలబడే వాడు. బాగా ధైర్యవంతుడు. ఐ.ఎ.ఎస్. పదవిని అతిచిన్న వయస్సులో కనీసం పెన్షన్ కూడా అందుకోకుండా గడ్డి పరకతో సమానంగా చూచి వదిలేశాడు. కలెక్టరు పదవియంటే సామన్యమైనది కాదు. ప్రభుత్వ కార్యదర్శులంతా యీ పదవి తర్వాతనే ప్రమోట్ అవుతారు. మందీ- మార్బలం- ఇదే బలగంగా గల సేవా జనంతో అడుగడుగునా నీరాజనాలు అందుకొనే అవకాశాలు - దండుగా డబ్బు సంపాదించుకొనే అవకాశాలు, డాబు, దర్పాలతో ఆనందంగా ఎ.సి.లతో భార్యబిడ్డల, బంధుమిత్రులతో దర్జాగా గడిపే అవకాశాలన్నింటిని తృణప్రాయంగా విసర్జించి ప్రజా సేవకే అంకితమైన కారణజన్ముడతడు. పోనీ ఏమైనా ఆస్తిపరుడా అంటే అదీకాదు. మధ్యతరగతి కుటుంబానికి కంటే క్రింది తరగతి స్థాయికి చెందినవాడు. అతిసామాన్య జీవితంతో హాయిగ తృప్తిపడే మనస్తత్వము అతనిది. తదనుగుణంగా భార్యాబిడ్డలు కూడా ఈ కఠోర త్యాగానికి వెనుక అర్ధాంగి రాధ త్యాగమే గొప్పదనిపిస్తుంది. మరి తల్లిదండ్రులు ఎందుకీ పేరు పెట్టారోగాని లోక్‌నాయక్ జయప్రకాష్ కూడా ఇంతే. 1976 వరకు ఎమర్జెన్సీ చీకటి రోజుల నెదురీది గెలిచిన మహానుభావుడే ఆ జయప్రకాష్.

ప్రస్తుతము లోకం పోకడంతా భయంకరంగా ఉంది. అంతా రౌడీరాజ్యం, ఆడదానికి అండ లేదు. మంచికి, న్యాయానికి ధర్మానికి చోటు లేదు. కనీసం వాటి సానుభూతిపరులకు కూడా ధైర్యం లేని పరిస్థితి. ఎక్కడ చూసినా రౌడీలతో, డబ్బుతో, మద్యంతో ఓట్లు వేయించుకొనే పరిస్థితే విపరీతంగా ప్రజాధనం దోపిడీ- ఈ పరిస్థితులకు - యీ కాలానికి ఎదురీత ఎంత సాహసమో - అయినా యీ పోకడకు ఎక్కడో ఒకచోట బ్రేక్ పడాలని కారణజన్ముడుగ, రాజకీయ సంస్కరణ సంస్కర్తగ ముందుకు వచ్చిన మన జేపీ విద్యార్థి దశ ఎలా ఉండిందో తెలియజేయాలనిపించింది.

జయప్రకాష్ విద్యార్థి దశ నుండే మంచి ధైర్యశాలి. శరీరకంగా బలహీనుడేగాని మంచి ధృడమైన మనోధైర్యము కలధీశాలి- బుద్ధిమంతుడు - నీతిపరుడు మంచి క్రమ శిక్షణ కలవాడు. తోటి మిత్రులతో కలిసి మెలిసి యుండేవాడు. శారీరకంగా బలహీనుడగుటచే ఆటల పట్ల అంతగా శ్రద్ధ కనబరచలేదు. అతనితో మూడేళ్ల నా అనుబంధమును తెలియజేయాలనిపించింది. నేను 1965వ సంవత్సరము ఆగస్టులో నందిగామ తాలూకు చింతలపాడు నుండి కంపిపాడు సమీపంలో గల గొడవర్రు హైస్కూలుకు కావాలని సైన్సుటీచర్‌గా ట్రాన్స్‌ఫర్ చేయబడ్డాను. కృష్ణాజిల్లాలో విద్య- ఆటలలో గొడవర్రు స్కూలుకు అప్పట్లో ప్రత్యేక స్థానముంది. 1965లో గొడవర్రు హైస్కూలుకు మేమంతా కష్టపడి నూటికి నూరుశాతము ఫలితాలను అందుకొనిన మధురాను భూతులవి. గొడవర్రు హైస్కూలు ప్రముఖ సోషలిస్టు నాయకుడు గుత్తా రాజారావు గారు నెలకొల్పారు. వారు ఆ గ్రామానికి సర్పంచ్‌గా చాలాకాలము పని చేశారు. విద్యపట్ల వారికి గల ప్రోత్సాహము మా ఉపాధ్యాయులకు ఎంతగానో తోడైంది. ఆడ పిల్లల్ని చదువులకై బయటికి పంపే అవకాశము లేని రోజుల్లో గొడవర్రు గ్రామం నుండి ఎందరో విద్యావంతులై ఉన్నత పదవుల్లో కనబడుచున్నారు.

అందుకే గొడవర్రు స్కూల్లో చదివించాలని తల్లిదండ్రులు గొడవర్రులోనే కాపురముండి పిల్లల్ని చదివించిన సంఘటనలు చాలా కలవు. ఈ పరిస్థితుల్లో మన జేపీ గొడవర్రు హైస్కూల్లో చేరటానికి కారణమైంది. అతని తండ్రి నాగభైరవ వెంకటేశ్వరరావు రైల్వేలో గార్డుగా పని చేస్తుండేవాడు. వీరిది ఇందుపల్లి ప్రక్కనగల వేమండ అయితే అత్తవారిది గొడవర్రు పాతబంధుత్వమే వెంకటేశ్వరరావు గారి మామగారు దాసరి కోటయ్యగారు. మన జేపీ పూర్తి పేరు నాగభైరవ జయప్రకాష్‌నారాయణ్‌కి ఇద్దరు తమ్ముళ్లు. అక్కలు, చెల్లెళ్లు లేరు. దాసరి కోటయ్యగారు తన మనుమడిని వెంటబెట్టుకొని వచ్చి హైస్కూల్లో చేర్పించారు. ఉద్యోగరీత్యా జేపీ తండ్రి వెంకటేశ్వరరావు గారికి తీరిక తక్కువ కావటంతో జేపీ చదువులపట్ల తాతగారైన కోటయ్యగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. జేపీ పెద్దమ్మ యలమంచిలి శేషమ్మగారు గొడవర్రు వాస్తవ్యులే. ఆమెకు సంతానం లేదు. జేపీ పెంపకంలో పెద్దమ్మ శేషమ్మ గారు కీలక పాత్ర వహించారు. వీరింటికి దగ్గరలోనే

మేముండే వసతి గృహముండేది. శేషమ్మగారు నా భార్య శారదతో జేపీని గురించి శ్రద్ధ తీసుకొనవలసిందిగా కోరేది. అట్లే తాతగారైన కోటయ్యగారు, మేనమామ నాగేశ్వరరావు గారు నా వద్ద జేపీని గురించి వాకబు చేసేవారు.

పువ్వుపుట్టగానే పరిమళం గుబాళిస్తుందనటానికి జేపీయే ఉదాహరణ నా వద్ద జేపీ 8,9,10 తరగతులు చదివాడు. అప్పట్లో చాల బలహీనంగా, నీరసంగా కన్పించేవాడు. కాని నోరు విప్పితే కంగు కంగుమని స్వరముండేది. ప్రతిరోజు సంచెడు పుస్తకాలతో చంకన తగిలించుకొని స్కూలుకు వచ్చేవాడు. స్కూలుకు ఎన్నడూ మొదటి బల్లపైనే కూర్చొనేవాడు. కేవలం టీచర్ చేప్పేదానిపై ఆసక్తి కలవారిలా వుండేవాడు.

8వ తరగతిలో మొదటి రోజునే నా దృష్టిలో పడ్డాడు. అతని పేరుతోపాటు ప్రవర్తన నన్ను బాగా ఆకర్షించాయి. అందుకే అతనంటే నా కంత యిష్టమైనది. జేపీతో నా అనుభూతులు తెలియజేస్తాను. ఏదోరకంగా పాఠము చెప్పుకుపోదామనుకుంటే అతనిముందు సాధ్యపడదు. అడుగడుగునా ప్రశ్నలు వేసే వాడు నేను నిజానికి అతని వలననే ఒక సమర్థుడైన ఉపాధ్యాయుడిగా రాణించానని తలుస్తా ప్రిపరేషన్ కాకుండా ఉపాధ్యాయుడు తరగతి గదిలో అతని ముందు నిలబడలేడు. ఆ చిన్న వయస్సులోనే అతడు అలా వుండేవాడు. ఈ మాటకొస్తే ఒక సంఘటన నాకు యిప్పటికీ బాగా గుర్తుంది. 8వ తరగతిలో రసాయనిక శాస్త్రపు సమీకరణాలు సిలబస్‌లో యుండేవి. గంధకామ్లము ( $H_2 SO_4$ ) అనే పాఠంలో దానిని తయారు చేయటానికి Theory చెప్పి బోర్డుపై సమీకరణాలు వేశాను.

$SO_2 + H_2O \rightarrow 2H_2 SO_4$ అని వ్రాశాను. వెంటనే జేపీ లేచి ఆ ఇక్వేషన్ తప్పుండి అని అన్నాడు. నిజానికి నేను కంగుతిన్నాను. నన్ను నేను సరిచేసికొని మనస్సులోనే సల్ఫర్ డై ఆక్సైడు ( $SO_2$) నీటిలో ($H_2O$) కరిగి గంధకామ్లము ($H_2 SO_4$) ఏర్పడేముందు సల్ఫూరిక్ అమ్లము ($H_2 SO_3$) ఏర్పడుతుంది. సల్ఫ్యూరస్ అమ్లము ($H_2 SO_3$) గాలిలో అక్సిజను ($O_2$) ను గ్రహించి గంధకామ్లముగ ($H_2 SO_4$) మారుతుంది. అని చెప్పగా వాటినన్నింటిని ఈక్వేషన్‌లో చూపమన్నాడు. అప్పుడు ఈక్వేషన్ వేసి చూపాను.

$$SO_2 + H_2O \rightarrow H2\ SO_3$$

$$2H_2 SO_3 + O_2 \rightarrow 2H_2 SO_4$$

ఇవి చూచి గాని శాంతించలేదు. అయినా ప్రయోగము చేసి చూపాలన్నాడు. నేను గైడ్ చేస్తూ అతనితోనే $H_2 SO_4$ తయారు చేయించాను. Blue litmus paper వేసి ఎర్రగా మారిందని తృప్తి చెందాడు. రేపటి పాఠము యీరోజు రాత్రే ప్రిపేర్ కాగలడని నా అంచనా కూడా.

ఇలా ఎన్నో సంఘటనలు. బయాలజీ పాఠము చెప్పుచున్నాను. "కప్ప-జీర్ణమండలము" అను అంశాన్ని చెప్పవలసి వచ్చినపుడు " Frog - Digestive system map" చూపాను. కాని జేపీ సరిపెట్టుకోలేదు. కప్పను కోసి చూపాలన్నాడు. కప్పను చంపాలంటే కొంచెం సందేహించాను. వెంటనే అతడు లేచి రేపు కప్పని "Chloro form" తెస్తానండి అని అన్నాడు. మర్నాడు ఉదయమే కంకిపాడు నడచి వెళ్లి Chloro form తీసికొని కప్పను పట్టుకువచ్చాడు. ఒక బేసిన్‌లో నీరు పోసి దానిలో Theory వేసి కప్పను దానిలో వేశాడు. కొంత సేవటికి కప్ప చనిపోయింది. అ తర్వాత నేను Disscet చేశాను. Digestive system పూర్తిగా అర్థం చేసికొన్నాడు. దానితో పాటు కప్ప Teeth, Tongue, Heart ఎలా వున్నదీ చూచాడు. మిగిలిన విద్యార్థులకు కూడా తానే ఎక్స్‌ప్లేన్ చేసేవాడు. అప్పుడు శాంతించేవాడు. నిజంగా " Education Should be givne in an atmosphere of freedom and joy " అనే నినాదంతోనే శాంతి నికేతన్‌ని రవీంద్రుడు స్థాపించాడు. ఈ పరిస్థితులలోనే బోధన యుండి, గురుశిష్యుల సంబంధము దగ్గరకు వచ్చి అప్యాయతతో యుంటే చాల మంది శిష్యులు మెరుగయ్యెదరు.

నేను పనిచేసిన ప్రతి స్కూల్లోను సైన్సుక్లబ్ ఏర్పరచుట నా అభిమతము. గొడవర్రులో పని చేసిన మూడేళ్ళు సైన్సుక్లబ్‌కి జేపీయే సెక్రటరీ. నెలకు రెండు మారులు క్లబ్ సమావేశము జరిగేది. క్లబ్ ఆధ్వర్యంలో క్విజ్, డిబేట్స్, వ్యాసరచన యిలాంటి పోటీలుండేవి. జేపీ చాలా సమర్థతతో నిర్వహించేవాడు. అతని స్వరము చాల గంభీరంగా యుండేది. అన్ని తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులందరు సమావేశములో పాల్గొనేవారు. ఆ రోజుల్లోనే అంత పిన్న వయస్సులోనే మాట్లాడటానికి జేపీకి స్టేజి ఫియర్ వుండేది కాదు. ధారాళంగా తెలుగు, ఇంగ్లీషులలో మాట్లాడేవాడు. ఇంటి వద్ద ఎక్కువగా చదివేవాడు కాదు. తరగతి గదిలోనే ఏకాగ్రత కలిగియుండేవాడు. ద్రోణాచార్యుడు తన శిష్యులకు విలువిద్య పరీక్ష పెట్టినప్పుడు దుర్యోధనాదులకు చెట్టు పై పక్షియే కాక చెట్టు యొక్క కాయలు, పూవులు, ఆకులు ఇవన్నీ కన్పించాయి. కాని అర్జునునికి ఒక్క పక్షిమాత్రమే కనిపించింది. అందుకే అర్జునునిపై ద్రోణాచార్యునకు అంతప్రేమ మన జేపీకి కూడా గురువుల ఆశీస్సులు పరిపూర్ణంగా అందాయి. అతనికి పదవతరగతి పూర్తయ్యాక నాకు మోపిదేవి హైస్కూలుకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. అతనిని వదలిరావటం నాకు చాల బాధ కలిగింది.

గొడవర్రులో హైస్కూల్ విద్యా పూర్తయ్యాక విజయవాడలోని లయోలా కళాశాలలో ఇంటర్ మీడియట్, ఆ తర్వాత గుంటూరు వైద్యకళాశాలలో మెడిసిన్, ఆ తర్వాత ఐ.ఎ.ఎస్. చేసి వివిధ హోదాల తర్వాత కలెక్టరు కావటం జరిగింది. ప్రకాశం జిల్లాలో కలెక్టరుగ పనిచేసినపుడు రైతాంగానికి ఆయన సేవలు మరువలేనివి. మరి స్వార్థపర రాజకీయాలతో ఇమడలేక తన పదవిని త్యజించి లోక్‌నాయక్ దారిలోనే యీ జయప్రకాష్ కూడా ప్రజాసేవనే ఎంచుకొని నిస్వార్థముగ, నిజాయితీగ, డబ్బు, మద్యములకు దూరంగా యుండే లోక్‌సత్తా పార్టీని స్థాపించి రాజకీయ బరిలో దిగటమైనది. ప్రజలు ఆయన ఆశయాలను అర్థం చేసికొని తగురీతిని స్పందించగలరని ఆశిద్దాము. ◆

## మీ ప్రేమను గుండెల్లో నింపుకుని వెళుతున్నా






**తెనాలి :** ఓ రాజకీయ పార్టీ నాయకునిగా రాలేదు. మామూలు మనిషిగా మీతో గడపాలని వచ్చా. మీరందించిన ప్రేమను గుండెల్లో నింపుకుని వెళుతున్నా అంటూ లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ స్వధారలో ఆశ్రయం పొందిన చిన్నారులను అక్కడ చేర్చుకుని సాంత్వన చూకూర్చారు. డిసెంబర్4 ఉదయం తెనాలి విచ్చేసిన ఆయన జె.ఎం.జె. 'స్వధార' స్వచ్ఛంద సంస్థలో ఆశ్రయం పొందుతున్న హెచ్.ఐ.వి. అనాథలైన బాలలతో కొంత సమయం గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సాటిమనిషిపై ప్రేమ, దయలేకుండా కొంతమంది అవకాశాలను స్వార్థం కోసం వాడుకోవటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఆశ్రయ నిర్వాహకురాలు సరళను ఆయన సత్కరించారు. డాక్టర్ జెస్సింతా, మేరీ థామస్, పి. శ్రీనివాస్, బొంతు ఉమామహేశ్వర రెడ్డిలు పాల్గొన్నారు.

## అసమానతల్లేని సమాజం కావాలి

**తెనాలి :** భారతీయ సంస్కృతి, నైతిక విలువలు గొప్పవని, అసమానతలు లేని సమాజం మన భావితరాలకు కావాలని, లోక్‌సత్తా నేత డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. పావులూరి సరోజిని దేవి, బాపయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబరు 4 స్థానిక జెయంజె కళాశాల ఆవరణలో మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులకు విశిష్ట పురస్కార ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా 'ఆధునిక సమాజంలో మానవీయ విలువలు' అనే అంశంపై పలువురు ప్రముఖులు ప్రసంగించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జేపీ మాట్లాడుతూ... వారసుల కోసం సమాజాన్ని దోచుకుతినే సంస్కృతి పెరిగిపోయిందని, ఆ విష సంస్కృతి కూకటివేళ్ళతో పెకిలించాల్సిన అవసరం వుందన్నారు. ప్రపంచ మానవతకు, మానవాళికి బిల్‌గేట్స్, వారెంట్ బఫెట్‌ల్ ఆదర్శమన్నారు. ప్రపంచంలో ఆనందంగా వున్న దేశాల్లో మనదేశం మొదటిదని దీనికి మన కుటుంబ వ్యవస్థే కారణమన్నారు. ప్రముఖ సాహితీవేత్త మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మిప్రసాద్ మాట్లాడుతూ.. ఐదు వేల సంవత్సరాల ప్రపంచ చరిత్రలో ఐదుగురు మహా పురుషులుంటే వారిలో ముగ్గురు మనవారేనని అది మనకు గర్వకారణమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు పావులూరి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ జెస్సింతా, కరస్పాండెంట్ మేరీ థామస్, గుడివాడ ఎఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రగతికి కులం అడ్డుగోడ కాకూడదు**

జె.పి. తెనాలి పర్యటన సందర్భంగా స్థానిక ఎ.ఎస్.ఎన్. కె.ఎస్.ఎస్. మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో



చర్చాగోష్ఠిలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వెలిబుచ్చిన పలు సందేహాలను నివృత్తి చేశారు. రిజర్వేషన్లు అవసరమా..! కాదా అన్న ప్రశ్నకు రిజర్వేషన్ పొందలేని వర్గాల్లో పేదలు ఎలా ఉన్నారో ఫలాలు పొందేవారిలో అనర్హులూ ఉన్నారన్నారు. ఇష్టమున్నా, లేకున్నా నేడు కులాన్ని బట్టే చదువు, డబ్బులు స్వాధీనమవ్వటం అసంజసం అన్నారు. వివక్షకు గురవుతున్న పేదల పిల్లలకు వెయిటేజ్ పద్ధతి అమలుచేస్తు కొంతవరకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. అవినీతి నిర్మూలించే విధానంపై మాట్లాడిన ఆయన 2జి స్పెక్ట్రం కుంభకోణాన్ని ఉదహరించారు. అధికారం కోసం మనిషిని ఉన్మాదిగా మారుస్తున్న స్వలాభపరుల ఎత్తుల నుంచి యువత మేల్కోనాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అన్నాబత్తుని శివకుమార్, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ మూర్తి, కె.రామ్‌చంద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్య, హేతుబద్ధత, రాజ్యాంగ విలువల కోసం నిలబడితేనే అంబేద్కర్‌కు వారసులం కాగలం: జేపీ

■ లోక్‌సత్తా ప్రధాన కార్యాలయంలో, ట్యాంక్‌బండ్ వద్ద బాబాసాహెబ్‌కు నివాళి

డిసెంబరు 6న అంబేద్కర్ 54వ వర్ధంతి సందర్భంగా తొలుత ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి జేపీ నివాళు లర్పించారు. తర్వాత లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాబాసాహెబ్ చిత్రపటానికి అంజలి ఘటించి పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు.

నాణ్యమైన విద్య, హేతుబద్ధత, రాజ్యాంగ విలువల్ని పెంచటం... ఈ మూడింటి కోసం నిలబడితేనే మనం డా॥ అంబేద్కర్‌కు వారసులం కాగలం. సమానత్వం కావాలి, కులవివక్ష పోవాలి అని మతతత్వ శక్తులు, అవినీతిపరులు కూడా నినాదాలిస్తుంటారు.కానీ అంబేద్కర్ పాటించిన ఆ విలువల్ని పాటించకుండా ఆ మార్పులు సాధ్యంకావు. అంబేద్కర్‌ని దళిత నాయకుడిగా చూస్తే జాతి చిన్నబోతుంది. ఆయన పుట్టుకతో వివక్షకు, సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన ఒక జాతీయ నాయకుడు. అందుకే జాతిపిత మహాత్మాగాంధీతో సమానంగా అంబేద్కర్‌ను కూడా లోక్‌సత్తా పార్టీ తన పతాకంలో పెట్టుకుంది.

కొంతమంది అవకాశాలను అందుకుని ఉన్నతస్థాయికి ఎదుగుతుంటే మరికొందరు అధ:పాతాళంలో, ఆత్మన్యూనతతో బతుకుతుంటే దేశం తీవ్రంగా నష్టపోతుందని అంబేద్కర్ పోరాడారు. ఆ అసమానతల్ని తొలగించాలంటే కులం, మతం, డబ్బుతో సంబంధం లేకుండా అందరికీ నాణ్యమైన విద్యను అందించటమే మార్గం. ఈవేళ మనదేశంలో ఇంజినీరింగ్ సహా అన్ని విభాగాల్లో అందుతున్న విద్యలో 90శాతం పనికిమాలినది. పట్టభద్ర నిరుద్యోగుల్ని తయారుచేస్తున్నారు. విద్యాహక్కుచట్టం పేరుకు మాత్రమే అమలవుతోంది. ఈ పరిస్థితిని మార్చి అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తే తప్ప సమానత్వాన్ని సాధించటం సాధ్యం కాదు. సమాజానికి, పాలనకు, రాజకీయానికి నాణ్యమైన విద్యను కేంద్రబిందువు చేయాలి. అంబేద్కర్ తన జీవితాంతం చట్టబద్ధ పాలనకు, రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేశారు. రాజ్యాంగాన్ని దేశానికి పూర్తిస్థాయి దిక్సూచిగా చేసేందుకు అందరూ కట్టుబడి ఉండాలి. సామాజిక విలువలకు, రాజ్యాంగం పేర్కొన్న ఉదాత్త విలువలకు మధ్య సంఘర్షణను అధిగమించి రాజ్యాంగాన్ని దేశ గమనానికి ప్రాతిపదికగా చేసేందుకు పోరాడాలి. చట్టబద్ధ పాలన దిశగా ప్రజల్ని నడిపించేందుకు అవినీతిరహిత న్యాయవ్యవస్థను నిర్మించుకోవటం అత్యవసరం.

## సందేశాన్ని అందించి తిరిగొస్తున్న రూ.1

**ప్రధాని కార్యాలయం అలసిపోయేలా 2-జీపై మూడు డిమాండ్లతో యం.వోలు, పోస్టుకార్డులు, ఈ-మెయిళ్ళు పంపండి : లోక్‌సత్తా**

2-జీ స్పెక్ట్రం లైసెన్సుల్ని రద్దు చేయాలని, ఆ కుంభకోణం వల్ల దేశం నష్టపోయిన రూ.1,76,000 వెనక్కి రాబట్టాలని, మళ్లీ అలాంటి అవినీతి జరగకుండా స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి వ్యతిరేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో ప్రధానమంత్రి కార్యాలయానికి రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సత్తా, యువసత్తా, మహిళాసత్తా కార్యకర్తలు పంపిన రూ.1 మనియార్డర్లు తిరిగి వస్తున్నాయి. వాటిని తిరస్కరిస్తున్నట్టు పీఎంవో అధికారులు వెనక్కి పంపారు. తమకు రూ.1ని పోస్టల్ సిబ్బంది తిరిగి చెల్లించేస్తున్నట్టు సామాన్య ప్రజలు కూడా తమ దృష్టికి తెస్తున్నారు. 2- జీ స్కాంపై ప్రజల ఆగ్రహం, హేతుబద్ధ డిమాండ్లతో కూడిన సందేశం ప్రధాని కార్యాలయానికి అందింది. మనియార్డర్లు తిప్పిపంపటానికి కూడా వాళ్లు అలసిపోయేలా ప్రధానమంత్రి ఆఫీసుకు రూ.1 మనియార్డర్లను డిమాండ్లతో ప్రజలు పెద్దఎత్తున పంపాలి. ఇప్పటికే పెద్దసంఖ్యలో పోస్టుకార్డుల్ని, మనియార్డర్లను, ఈ-మెయిళ్లను పీఎంవోకు లోక్‌సత్తా తరుపున పంపడం జరిగింది. డిసెంబర్ 9న అంతర్జాతీయ వ్యతిరేక దినం వరకూ ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలి. ఇందులో విద్యార్థులు, యువత పెద్దఎత్తున పాల్గొనాలి.

**న్యాయవ్యవస్థలో అవినీతిని నిర్మూలించి, అవినీతిపరుల్ని కఠినంగా శిక్షించేందుకు 'జాతీయ న్యాయ కమిషన్' ఏర్పాటుకు ఇప్పటికే లోక్‌సత్తా ప్రయత్నాలు ప్రారంభించింది.**

# నిఘంటువు

- కొంగర గంగాధరరావు

భాష మన సంస్కృతిని తెలియజేస్తుంది. తరతరాల మన భావనా తరంగాల తీరును తెలియజేస్తుంది. చరిత్రలో మన తప్పొప్పులను మనదైన దృక్పథంలో తెలియజేస్తుంది. భాష మన మనుగడను పునరావలోకింప చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. భాష మరణిస్తే ఒక నాగరికత మరణించినట్లు.

'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా మన భాషను పాశ్చాత్యులు వర్ణించినా 'దేశ భాషలందు తెలుగులెస్స' అని శ్రీ కృష్ణ దేవరాయలు అభివర్ణించినా అది తెలుగుకే చెల్లింది. కాలం చెల్లిన కవులెందరో పరిపుష్టం చేసిన తెలుగు భాష నేడు కాలం చెల్లి నానాటికీ క్షీణిస్తోంది. ఒక తరం క్రితం వాడుకలో వున్న తెలుగు పదాలు నేడు నిఘంటువు చూస్తే తప్ప అర్థం తెలియని స్థితి. అసలు 'నిఘంటువు' అంటే ఏమిటి అని ఎవరైనా ప్రశ్నిస్తే మనం ఆశ్చర్యపోతే మనం అమాయకుల క్రింద లెక్క. ఇది కాన్వెంటులో చదువుకుని 'అమ్మ' అంటే ఏమిటి 'మమ్మీ' అని ప్రశ్నించే నవతరాన్ని ఉద్దేశించి రాస్తున్న మాట అనుకుంటే మనం పప్పులో కాలేసినట్లే. ఈ తరం పిల్లల్లో కూడా మాతృభాషపై మమకారంతో పట్టుపట్టి తెలుగు నేర్చుకుంటున్న యువతరం పరిస్థితి ఇది.

గాంధీజీ మన పరదేశీ దాస్య శృంఖలాలు త్రెంచటంలో కృతకృత్యులయారు. కానీ ఆయన పెంచి పోషించిన అనుచర గణం పరభాషా దాస్య భావనలను ఆయన గ్రహించలేకపోయారు. జాతీయ భావాలున్న ఎందరో నాయకులు, మహాత్ముడి భావ నిరంకుశత్వం ముందు నిలబడ్డా నిష్ప్రయోజనమయ్యింది. దురదృష్టం కొద్దీ ఈ రోజు 'జాతీయ భావం' అంటే 'రామమందిరం' అనే అర్థం వస్తోంది.

ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం ఆంగ్ల నిఘంటువు పరిమాణం పెరుగుతోంది. ఎప్పుడూ వచ్చి చేరే పదాలతో ఆంగ్ల భాష పరిపుష్టం అవుతోంటే తెలుగుతో సహా ఎన్నో సుందరమైన భాషలు, ఆదరణ మృగ్యమై సరళమైన పదాలు కూడా కఠినపదాలుగా రూపాంతరం చెంది నిఘంటువులలో తప్ప మరెక్కడా కనపడక ప్రతీరోజు కృషిస్తున్నాయి. దీనికి కారణాలెన్నున్నా అంతుకు మించి మన భాషను కాపాడుకోవలసిన అవసరం ఎంతో ఉంది. లేనట్లయితే ఒక పెద్దమనిషి అన్నట్లు 'ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో మాట్లాడవలసిన దౌర్భాగ్యం' మనకు పడుతుంది. కాదు ఈ జాడ్యం మన మేధావులకు ఎప్పుడో పట్టింది. ఇక మిగిలింది తెలుగులో మాట్లాడటానికి పదాలు వెతుక్కోవడం. దాదాపు మనందరి పరిస్థితి ఇదే. ఇది భాషా దురభిమానంతోనే కాదు, అభిమానంతో కూడా వ్రాస్తున్నది కాదు. ఒక చారిత్రక అవసరాన్ని నొక్కి చెప్పాల్సిన సందర్భం ఇది.

శ్రీశ్రీ చెప్పినట్లు ఏ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం నరజాతి చరిత్ర సమస్తం పరపీడనపరాయణత్వం అని చరిత్రను మరచిపోదామనుకుంటే మనంత మూర్ఖులుండరు. చరిత్రలో చెడు ఎంత వుందో మంచి అంతే వుంది. తన మాటలను ''ఊ' కొట్టినవారు తన ఆలోచనలను గౌరవిస్తారని, తనని వ్యతిరేకించిన వారు తన భావాలనూ వ్యతిరేకిస్తారని గాంధీజీ ఆ రోజు పొరబడ్డారు. స్వాతంత్ర్యానికి ముందు, తరువాత గాంధీజీ ప్రభావం దేశ నాయకత్వం మీద ప్రజల మీద ఎంతో వుంది. గాంధీజీ పట్ల వున్న ఆరాధనాభావం స్వాతంత్ర్యానంతరం దేశప్రజలు ఆయన అనుచరులుగా పేరుబడ్డ వారిని ఆదరించటంలో కనబరిచారు. దురదృష్టవశాత్తూ వారిలోని జాతీయత కంటే పరభావన దాస్యం దేశ విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించే దిశగా తీసుకెళ్ళింది.

ఈవేళ 'ఇంగ్లీస్ డిక్షనరీ' లేని ఇల్లు వుండదు. కాని ' తెలుగు నిఘంటువు' ఎందరి ఇళ్ళలో వుంటుంది? బహూశా ఒక వీధి అంతా వెతికినా ఒక్క ఇంట్లోనూ వుండదేమో! దేనికీ దుస్థితి? నిజంగా మనకు నిఘంటువు అవసరం లేకుండానే తెలుగు పదాలకు అర్థాలు తెలుస్తున్నాయా అంటే అంతకంటే పచ్చి అబద్ధం మరొకటి వుండదు. అసలు తెలుగు అక్షరమాల సక్రమంగా రాయగలిగిన వారెందరు? ప్రతి ఇంటికి తెలుగు పత్రిక వస్తుంది. కానీ ఇప్పటితరం పిల్లల్లో ఎంతమంది తెలుగువార్తా పత్రికలను చదవగలరు? వ్యవహారిక భాష పరిస్థితే ఇలావుంటే తెలుగు గ్రంధాలు చెదలుపట్టి పోవలసిందే కదా!

దేశ ఆర్థిక వ్యవస్థ, సమాజంలో చెల్లుబాటు ఈరోజు ఆంగ్లంపై ఎంతగా ఆధారపడ్డాయంటే మమకారంతప్ప మాతృభాష అవసరం ఏమిటో తెలియని పరిస్థితి. ఆరోవేలులా అమ్మభాష వుంటే, పట్టు చిక్కని పరభాషను నేర్చుకొనేందుకు సమాజంలోని ఉన్నత వర్గాలను అనుసరిస్తూ మధ్య తరగతి, దిగువ తరగతి విద్యార్థులు పడుతున్న తిప్పలు ఖిన్నులను చేస్తాయి. ఆంగ్లభాష మనకు విజ్ఞానాన్ని దగ్గర జేయాలే తప్ప మనదైన అమ్మభాషను మనకు దూరం చేస్తే మనదైన సంస్కృతి మనకు తెలియకుండాపోతుంది. పాశ్చాత్య ఆలోచనా ధోరణులు పరిశీలించి నేర్చుకోదగ్గవే కాని మనవైన తాత్విక ధోరణులు, పరిశోధనలు, శాస్త్రాలు మనకు తెలియకుండాపోతే మనలో ఆత్మగౌరవం నశిస్తుంది. జాతిగౌరవం అనేది హాస్యాస్పదంగా మారి దేశభక్తిని పెంపొందించటానికి మార్గాలు మృగ్యమవుతాయి. ఈ దుర్గతి తప్పాలంటే ప్రపంచీకరణ నేపథ్యంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను సామాజిక శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి మన సమాజానికి కావలసిన రీతిలో అనుసంధానం చేయవలసిన అవసరం ఎంతో వుంది. ఈ దిశగా జరగాల్సిన కృషిని మన మేధావుల వర్గం గుర్తించి ముందడుగు వేస్తారని ఆశిద్దాం. ◆

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

## మెదక్

### బోనస్ ప్రకటించాలి: లోక్‌సత్తా

**సిద్ధిపేట టౌన్ :** ధాన్యం మద్దతు ధరపై క్వింటాలుకు రూ.200 బోనస్‌గా ప్రకటించాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్ధిపేటలో " రైతులకు ఐక్యతే వరం - అనైక్యతే శాపం' అనే గోడ పత్రికను నవంబర్ 20న ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బోనస్ కోసం రైతులు అంతా ఆందోళనబాట పట్టాలని పిలుపునిచ్చారు. త్వరలో లోక్‌సత్తా ఆధ్వర్యంలో మండలాల వారీగా రైతు ఐక్యత యాత్రలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. లోక్‌సత్తా అధినేత జేపీ చొరవతో నవంబరు24న సిద్ధిపేటలో పత్తిమార్కెట్ యార్డు ప్రారంభం అయింది. ఈ సమావేశంలో శంకరమ్మ, రాంచంద్రారెడ్డి, అంజూగౌడ్, నగేశ్, శ్రీనివాస్, ప్రకాశ్‌రావు, బీడరాయుడు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం

**సిద్ధిపేట రూరల్ :** లోక్‌సత్తా సిద్ధిపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి రామచంద్రారెడ్డి, అధికార ప్రతినిధిగా కంచర్ల నగేష్ నియామకమయ్యారు.



### రైతులు సంఘటితంగా ఉద్యమించాలి

**నంగునూరు :** రైతులు సంఘటితంగా ఉద్యమించాలని జెడ్పీటీసీ సభ్యుడు దువ్వల మల్లయ్య పిలుపునిచ్చారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో రాజ్‌గోపాల్ పేట గ్రామంలో రైతు ఐక్యత యాత్ర ప్రారంభమైన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గోడౌన్ల సంఖ్యను పెంచి, ఎగుమతులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి, రైతు ప్రతినిధులతో కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండలంలోని ఏ రైతును కదిలించినా దుఃఖమే కనబడుతుందని, ఎక్కడ చూసినా రైతులు పడుతున్న కష్టాల ఘోషే వినవస్తుందే కాని రైతులు సంతోషంగా ఉన్నట్లు కనిపించడం లేదన్నారు. మండలంలోని పత్తిపంటలు పూర్తిగా నాశనం అయ్యాయని వీరిని ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. ఎంపీపీ రాగుల సారయ్య మాట్లాడుతూ గోదాముల్లోని బియ్యాన్ని పేదలకు పంచిపెట్టి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్ సత్యం మాట్లాడుతూ సిద్ధిపేటలో కొత్త గోదాంలను నిర్మించాలని కోరారు. యాత్ర మండలంలోని ముండ్రాయి, పాలమాకుల, బద్దిపడగ, నంగునూరు, నర్మెట, వెల్కటూర్ గ్రామాల మీదుగా సాగింది. కార్యక్రమంలో కొల్లూరి రామచంద్రారెడ్డి, నగేష్, రాజు, దేశెట్టి రాజు, సుధాకర్, నరేష్, యాదగిరి, శ్రీనివాస్, చంద్రమౌళిలు పాల్గొన్నారు.

### అవినీతిపరుల భరతం పట్టాలి

**సిద్ధిపేట :** అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలో డిసెంబరు 3 నుంచి 9 వరకు చలో పోస్టాఫీసు కార్యక్రమాలను చేపడుతున్నామని శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా యువత, విద్యార్థులు ప్రధాన మంత్రి కార్యాలయానికి పోస్టుకార్డులను రాయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్క రూపాయి మనియార్డర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

### స్వతంత్ర ప్రతిపత్తి గల అవినీతి వ్యతిరేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.

**సిద్ధిపేట :** దేశంలో అవినీతి పెరిగిపోవడంతో అభివృద్ధి ప్రశ్నార్థకమైందని, రాజకీయ అండదండలతోనే 2జి స్పెక్ట్రమ్ వంటి అతిపెద్ద కుంభకోణం జరిగిందని, భవిష్యత్తులో ఆర్థిక నేరాలను, అవినీతిపరులను శిక్షించడానికి, సొత్తును రాబట్టడానికి స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి వ్యతిరేక కమీషన్‌ను ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ జయప్రకాష్‌నారాయణ నేతృత్వంలో జాతీయ స్థాయిలో అవినీతి వ్యతిరేకంగా ప్రచారోద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని విశిష్ఠ వ్యక్తులను పౌర సంఘాల ప్రతినిధులను ఒకే వేదిక మీదికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. లోక్‌సత్తా కన్వీనర్ గంగాపురం మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత కరపత్రాన్ని కూడా విడుదల చేశారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ మహేశ్, యువసత్తా ప్రతినిధి బాల్‌కిషన్ తదితరులు ఉన్నారు.



## కుటుంబ పాలనే అవినీతికి మూలం

**సిద్దిపేట** : రాజకీయ పార్టీల్లో కుటుంబ పాలనే అవినీతికి మూలమని లోక్‌సత్తా నాయకులు శ్రీనివాస్ అన్నారు. డిసెంబరు3న ఛలో పోస్టాఫీస్ కార్యాక్రమం సందర్భంగా పట్టణంలోని కళాశాలల విద్యార్థులు శ్రీవిద్య డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించి పోస్టుకార్డులు రాసి ప్రధాన మంత్రికి పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కొన్ని కుటుంబాలు మాత్రమే పాలన సాగిస్తున్నాయని, రాష్ట్రంలో కొన్ని కుటుంబాలు ప్రభుత్వాలను శాసిస్తుండడం దారుణమన్నారు. పార్టీలు కుటుంబాల నీడన చేరడంతో వ్యక్తి పూజ ఎక్కువై అవినీతికీ కేంద్రాలుగా మారాయన్నారు. యువత, విద్యార్థులు లేకుండా ఏ ఉద్యమం విజయం సాధించలేదని, యువత పాలనా పగ్గాలు చేపట్టాల్సిన సమయం అసన్నమైందన్నారు.

నాయకులు రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ అవినీతికి పాల్పడ్డ వారిని శిక్షించడమే కాకుండా సొమ్మును కూడా రాబట్టాలని, అప్పుడే ప్రజాస్వామ్యంపై ప్రభుత్వ సంస్థలపై నమ్మకం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్, రాజు, మహేశ్, శ్రీనివాస్, యాదగిరి, నరేష్, రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## 6న విద్యార్థులకు వ్యాసరచన పోటీ

**సిద్దిపేట్ టౌన్** : లోక్‌సత్తా ఆధ్వర్యంలో సిద్దిపేటలోని శ్రీవిద్యా డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 6న మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంట వరకు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గంగాపురం మహేశ్ తెలిపారు. 'అవినీతి నిర్మూలనలో యువత పాత్ర–రాజకీయ పార్టీల వైఖరి' అనే అంశంపై ఈ పోటీ జరిగిందని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వేరువేరుగా బహుమతి ప్రధానం చేసామని తెలిపారు.

## కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**సిద్దిపేట్ రూరల్** : కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆర్డిఓ కార్యాలయంలో ఎదుట కాంట్రాక్టు లెక్చరర్లు చేపడుతోన్న రిలే నిరాహార దీక్షలు డిసెంబరు3 నాటికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధ్యాపకులకు టైమ్ స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే వారికి మద్దతుగా తాము కూడా దీక్షలు చేపడతామని హెచ్చరించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, టీఆర్ఎస్వీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాం యాదవ్ లెక్చరర్లకు సంఘీభావం ప్రకటించారు. ఈ శిబిరంలో లెక్చరర్లు సువర్ణాదేవి, జ్యోతి, శారద వనిత, స్వప్న, ప్రణిత, రాములు, రఘునందన్, వై.ఎల్.ఎన్.రెడ్డి, శ్రద్ధానందం, ఆంజనేయులు, రమేష్ కూర్చున్నారు.




## రాజకీయ అండతోనే అవినీతి

**సిద్దిపేట్** : రాజకీయ అండదండలతోనే అవినీతి తారాస్థాయికి చేరుకున్నదని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ విమర్శించారు. అవినీతిని అంతం చేయాలని ప్రజల సొమ్మును తిరిగి రాబట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ డిసెంబర్ 2న  చలో పోస్టాఫీసు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒక రూపాయి మనియార్డర్‌ను ప్రధానమంత్రికి పంపించారు. అవినీతి పై పోరాటం ముఖ్య సమస్యగా గుర్తించి పార్లమెంటులో చర్చించాలని కోరారు. రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపారులు రహస్య ఒప్పందాలు చేసుకుంటుండంతో చట్ట బద్ద సంస్థల పై ప్రజలకు నమ్మకం పోతోందని చెప్పారు. అవినీతిని అంతం చేయడానికి సమర్థవంతమైన వ్యవస్థ రూపకల్పన చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు లేనిదే అవినీతి జరుగడం లేదని వారు ఆరోపించారు. అవినీతిని రూపుమాపడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని, దానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు కోరారు. ఇందుకోసం ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమానికి లోక్‌సత్తా పట్టణ కన్వీనర్ గంగపురం మహేశ్ సారథ్యం వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాంచంద్రారెడ్డి అధికార ప్రతినిధి కంచర్ల నగేష్, యువసత్తా కన్వీనర్ దేశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి



### రాజకీయాలకతీతంగా రైతులు ఏకం కావాలి

**తణుకు రూరల్ :** సమస్యలపై రాజకీయాలకతీతంగా రైతులు ఏకం కావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యస్. మనోరమ అన్నారు. గ్రామాలలో రైతులందరూ రాజకీయాలకతీతంగా రైతువేదికలు ఏర్పాటు చేసుకుని, సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం బియ్యంమీద 1.5 శాతం పన్ను వసూలు చేసి క్వింటాలు ధాన్యానికి రూ.100 బోనస్ ఇస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడైనా అమ్ముకోవడానికి స్వేచ్ఛనిచ్చిందన్నారు. మన రాష్ట్రంలో బియ్యంమీద 10 శాతం పన్ను వసూలు చేస్తూ రూ. 200లు బోనస్ ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. రాష్ట్రంలో, దేశంలో అమ్ముకోవడానికి కూడా స్వేచ్ఛలేదని దీనివల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తడిసిన రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి, రూ.200లు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేసారు. ఆహారధాన్యాలను దేశీయ మార్కెట్లలో ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛనిచ్చి, ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నప్పుడు ప్రభుత్వ సంస్థల ద్వారా ఎగుమతులు చేసి, అదనంగా వచ్చిన లాభాన్ని రైతులకు అందించే ఏర్పాటు చేయాలన్నారు. రైతుసంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వాకలపూడి వీరరాఘవులు మాట్లాడుతూ పామాయిల్ సహా ఇతర నూనెలు, పంచదార వంటి ఆహార పదార్థాల దిగుమతులపై సుంకం విధించి, ఆదాయాన్ని రైతులకు సబ్సిడీగా అందించాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో అదనంగా 30 లక్షల టన్నుల గోడౌన్ల నిర్మాణాన్ని చేపట్టాలని, రైతులు ప్రైవేట్ గోదాములలో, ఇళ్ళల్లో నిల్వ చేసుకున్న ధాన్యానికి ఋణాలు ఇవ్వాలని అన్నారు.

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసి, 50 శాతం సొమ్మును రైతుల వ్యవసాయ పనులకు ఖర్చుచేయడానికి ఈ పథకాన్ని రూపొందించాలని కోరారు. సమావేశంలో జక్కంశెట్టి శ్యామ్‌సుందర్, గుణ్ణం గోవిందరావులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది

**తణుకు:** స్వాతంత్ర్య సమరయోధులు సీపీఐ నాయకులు భూపతిరాజు సుబ్బారావు 4వ వర్ధంతి సందర్భంగా డిసెంబర్2న సురాజ్యభవన్‌లో జరిగిన సభలో 'భారతీయ ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీలు' అనే అంశంపై లోక్‌సత్తా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.యస్. వర్మ మాట్లాడుతూ దేశం పట్ల, ప్రజాస్వామ్య విలువలు పట్ల అవగాహన పెంపొందించవలసిన అవసరం వుందన్నారు.

# కృష్ణా




### 31, 35 డివిజన్లలో లోక్‌సత్తా సభ్యత్వ నమోదు

**చిట్టినగర్ :** లోక్‌సత్తా పార్టీ విజయవాడ అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో చిట్టినగర్‌లోని 31, 35 డివిజన్లలో సభ్యత్వ నమోదు, సభ్యత్వ రెన్యువల్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువత విశేష సంఖ్యలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనుమోలు గాంధీ, జిల్లా ప్రధాన కార్యదర్శి వి. రాజమణి, ఉపాధ్యక్షులు యన్‌యం డాంగే, కోట శ్రీనివాసరావు, కత్తుల రత్నం, సెక్రటరీ బండారు పూర్ణచంద్రరావు, కార్యాలయం సెక్రటరీ బోజడ్ల సత్యనారాయణరావు, 35వ డివిజన్ నాయకులు వైకె ముత్యాలరావు, 31వ డివిజన్ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా సత్తా నాయకులు శైలజ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు

### రైతు గోడు ప్రభుత్వానికి పట్టదా?

**పత్తికొండ :** పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించక, మరో వైపు తుఫాను తాకిడికి నష్టపోయిన రైతులను ఆదుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని లోక్‌సత్తా పత్తికొండ నియోజకవర్గ కన్వీనర్ కె. ఆనందాచారి విమర్శించారు. రైతులు సర్వం కోల్పోయి బజారున పడ్డారన్నారు. ప్రభుత్వం అందించే పరిహారం రైతులకు ఏ మూలకు చాలదని వాపోయారు. దాన్ని కూడా అధికారులు,

నాయకులు కుమ్మక్కై రైతులకు అందకుండా స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్ధతు ధరలు ప్రకటించాలని, పంటలకు భీమా చెల్లించే విధంగా చర్యలు గైకొనాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి రైతులు తగిన ప్రతిఫలం పొందడానికి పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో లోక్‌సత్తా పత్తికొండ మండల పార్టీ నాయకులు కె. మాధవరెడ్డి, ప్రసాద్, నాగభూషణం, శేఖర్, చాంద్‌బాషా, మహమ్మద్, ఎర్రిస్వామి, ఎ. రామసుబ్బయ్య, యస్. పీర్‌మోదిన్, జి. సుధాకర్, అల్లాభకాష్, లక్ష్మిస్వామి, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయంగా ఎదిగితేనే సమస్యలు పరిష్కారం

కోడుమూరు: దళిత, బడుగు, బలహీనవర్గాల ప్రజలు రాజకీయంగా ఎదిగితేనే సమస్యలు పరిష్కారమవుతాయని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు నరసింహులు అన్నారు. పట్టణంలో కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జీ ప్రతాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలశాఖ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి వల్లనే సమస్యలు అపరిష్కృతంగా నిలిచిపోతున్నాయని విమర్శించారు. రాజకీయ క్రీడారంగంలో ప్రజల సమస్యలు ఆటగాళ్ల బంతుల్లా మార్చారన్నారు. ప్రతి ఒక్కరూ రాజకీయంగా ముందుకొచ్చి విద్య, వైద్యం, ఉపాధి అందరికీ అందే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లా కోశాధికారి శంకర్ మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం మండల నూతన శాఖ ఎన్నిక కార్యక్రమం జరిగింది. మండల శాఖ అధ్యక్షులుగా దేవరాజు, ఉపాధ్యక్షులుగా అటో మల్లి, కార్యదర్శి నాగేష్, సహాయ కార్యదర్శులు మోహన్, కోశాధికారిగా సుదర్శన్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో స్థానిక లోక్‌సత్తా నాయకులు పక్రుద్దీన్, రాము, మధు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు

### రైతు ఐక్యవేదిక ఆవిర్భావం

**రొంపిచర్ల :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో మండల రైతు ఐక్య వేదికను రూపొందించారు. ఏడు గ్రామాల నుంచి 70 మంది రైతులు పాల్గొన్నట్టు నియోజకవర్గ అధ్యక్షుడు ఈదర గోపిచంద్ తెలిపారు. చిరుమామిళ్ళ రామకృష్ణ ప్రసాదు, మాలెంపాటి నరసింహారావు, వనిపెంట వెంకట రామిరెడ్డి, కల్లి సుబ్బారెడ్డి, ఇంటూరి వెంకట్రామిరెడ్డి, గంగవరపు భగవన్నారాయణ, జాగర్లమూడి శివపార్వతి, పడాల సుబ్బారెడ్డి, కొండ్రాతి మస్తానయ్య, వనిపెంట కృష్ణారెడ్డి, ఏలూరి హనుమంతరావులు రైతు ఐక్యవేదికలో వున్నారన్నారు. కార్యక్రమంలో వీ శివనాగేశ్వరరావు, కె. లలితకుమారి, ఘంటా నిర్మలాబోస్, పాత వెంకటేశ్వర్లు, కరణం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### కృత్రిమ కలుషిత సేద్యం వద్దు - ప్రకృతి సిద్ధసేద్యమే ముద్దు...

**నరసరావుపేట :** నాటి రైతు సహజసిద్ధ వ్యవసాయం చేసి, సమాజానికి అన్నదాతగా నిలిచేవాడని, నేటి రైతు మాత్రం విచక్షణారహితంగా పురుగుమందులు, కృత్రిమ ఎరువులను ఉపయోగించి కాలుష్యంతో విషపూరితం చేస్తున్నాడని ప్రముఖ విశ్రాంత వ్యవసాయ శాఖాధికారి డాక్టర్ జజ్జర జ్యోతి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ముక్కామల నివాసంలో లోక్‌సత్తా ఆధ్వర్యంలో జరిగిన మండలస్థాయి రైతు సదస్సులో ఆయన రైతులకు పలు సూచనలు, హెచ్చరికలను చేశారు. మరో విశ్రాంత వ్యవసాయాధికారి సింగం రామిరెడ్డి మాట్లాడుతూ రైతులు గోఅధారిత వ్యవసాయం చేపట్టాలని, గో మూత్రాన్ని క్రిమి సంహారిణిగా వాడాలని, చేలగట్లపై వేపచెట్టు పెంచాలని సూచించారు. లోకసత్తా జిల్లా ప్రధాన కార్యదర్శి వి. శివనాగేశ్వరరావు మాట్లాడుతూ నాన్ బాసుమతి బియ్యం ఎగుమతికి మూడురోజుల్లో 200 రూపాయలు బోనస్ విడుదలకు, స్వేచ్ఛావాణిజ్యానికి, గోడౌన్ల ఖాళీకి మార్గం సుగమమైందన్నారు. ఈ సమావేశంలో ఈదర గోపిచంద్, వల్లెపు ఏడుకొండలు, నందాల సత్యనారాయణరెడ్డి, వై ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### అవినీతి పై యువత పోరాడాలి

**నరసరావు పేట :** దేశ వ్యాప్తంగా అవినీతి కుంభకోణాలు చేస్తున్న అవినీతిపరుల ఆటలు కట్టించేందుకు నేటి యువతరం ముందుకు రావాలని స్థానిక లోక్‌సత్తా నేతలు అత్తలూరి బాలభాస్కర్, ఈదర గోపీచంద్, గంటా నిర్మలా బోస్ కోరారు. స్థానిక వాసవి జూనియర్ కళాశాలలో లోకసత్తా ఆధ్వర్యంలో అవినీతి వ్యతిరేక పోరాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కామన్‌వెల్త్ క్రీడలు, ఆదర్శ కేటాయింపులు, 2జి స్పెక్ట్రమ్ తదితర కుంభకోణాల్లో లక్షల కోట్ల ప్రజా ధనాన్ని దిగమింగారని ఆరోపించారు. 68 మంది విద్యార్థులు ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు పోస్టుకార్డులు రాశారు. 14 మంది విద్యార్థులు ఒక రూపాయి చొప్పున మనియార్డర్లు పంపారు. జైభారత్ పార్టీ నాయకులు కరణం సుబ్బారావు, లోక్‌సత్తా పార్టీ కరణం సుబ్బారావు, లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి కటకం చినపేరిరెడ్డి, కోశాధికారి కె.పి.రామారావు, కళాశాల డైరెక్టర్ గుర్రం కృష్ణారెడ్డి, రామకృష్ణా పాల్గొన్నారు.

## విజయనగరం

### టన్ను చెరుకుకు రూ.2,200 ఇవ్వొచ్చు

**జామి :** ఈ ఏడాది టన్ను చెరుక్కు రూ.2,200 రూపాయలు చొప్పున రైతులకు చెల్లించవచ్చని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. గిట్టుబాటు ధరపై నాన్పుడి వైఖరి మానాలని,

వెంటనే ధరను ప్రకటించాలని సూచించారు. జిల్లాలో 70శాతం మంది చెరుకు పండిస్తున్నారని తెలిపారు. తుఫాను ప్రభావంతో వరితో పాటు చెరుకు పంటకు కూడా నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ సమయంలో టన్నుకు రూ. 2,200 ఇవ్వకపోతే రైతులకు గిట్టుబాటు కాదన్నారు. రూ. 2,200 ధర ప్రకారం చూస్తే ఈ ఏడాది 4 కోట్లు కర్మాగారం భరించాల్సి వుంటుందని, దానిలో రూ. 2 కోట్లను వివిధ రూపాలలో సమకూర్చుకోవచ్చునని చివరకు రూ. 2 కోట్లు మాత్రమే భరించాల్సి వుంటుందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ కేంద్రంలోని సుగర్ అభివృద్ధి నిధుల నుంచి వడ్డీ లేని రుణంగా 4 కోట్లు తీసుకువస్తే కర్మాగారానికి కష్టాలు వుండవన్నారు. కర్మాగారంపై పర్సన్ ఇన్‌చార్జి పూర్తిగా బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించాలని తెలిపారు. గతంలో ఆధునికీకరణ పేరిట వసూలు చేసిన టన్నుకు 50 రూపాయలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా మండల ప్రతినిధులు గార పెంటయ్య, మిడతాన అప్పారావు, రొబ్బి సూరిబాబు, పోలపర్తి అప్పలసత్యం, ఎర్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



## లోక్‌సత్తాలో 50 మంది చేరిక

**జామి :** జామి మండలంలోని సుగర్ ఫ్యాక్టరీ, ఎంకెవలస, కుమరాం గ్రామాలకు చెందిన దాదాపు 50 మంది యువకులు, పిఆర్పీ నాయకులు గారపెంటయ్య, సిహెచ్ నాగరాజులతో. రొబ్బి సూర్యారావు, పోలుపర్తి అప్పల సత్యం లోక్‌సత్తా పార్టీలో చేరారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సమక్షంలో వీరంతా పార్టీలో చేరినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ లోక్‌సత్తా పార్టీ విధానాలకు ఆకర్షించి వీరంతా పార్టీలో చేరారని అన్నారు. అలాగే రాబోయే కాలంలో లోక్‌సత్తా పార్టీకి మరింత ఆదరణ పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి దేవర ఈశ్వరరావు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు ఎమ్ఎస్ఎన్ రాజుమండల పార్టీ ప్రతినిధి మిడతాన అప్పారావు, పి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపై ఉద్యమం

**గజపతినగరం :** రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రధానమంత్రికి ఉత్తరాలు రాసే కార్యక్రమం చేపట్టామని, లోక్‌సత్తా నాయకులు దేవర ఈశ్వరరావు తెలిపారు. డిసెంబరు 3 నుంచి 9 వరకు అన్ని నియోజకవర్గాల్లో అవినీతి కార్యక్రమాలపై ర్యాలీలు, సభలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బి. రమణానందం, జోగారావు, వగ్రి విష్ణు పాల్గొన్నారు.

## వరికి గిట్టుబాటు ధర కల్పించాలి

**సాలూరు :** భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని లోక్‌సత్తా నాయకులు బి. కోటేశ్వరావు, సారంగపాణి, జె.ఎం. సోమనాధరావు డిమాండ్ చేశారు. రైతు గిట్టుబాటు ధరలపై వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. గిట్టుబాటు ధరలపై రైతుల్లో అవగాహన కల్పించడానికి గ్రామాల్లో పర్యటిస్తామన్నారు.

## లోక్‌సత్తా చొరవతో వార్డు సమస్యల పరిష్కారం

**ఫూల్‌బాగ్ :** పట్టణంలోని ఒకటో వార్డు సమస్యలు లోక్‌సత్తా పార్టీ చొరవతో పరిష్కారమయ్యాయని పార్టీ ఉపాధ్యక్షుడు తాడేల వెంకటరావు తెలిపారు. వార్డులో పారిశుద్ధ్యలోపం, వీధి దీపాలు, తాగునీటి సమస్య పరిష్కారం కోరుతూ గతంలో మున్సిపాలిటీ అధికారుల దృష్టికి లోక్‌సత్తా తీసుకెళ్లిందని చెప్పారు. ఇందుకు ప్రతిఫలంగా సంబంధిత అధికారులు వార్డుల్లో సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. వార్డులో వీధిలైట్లను బాగు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డుకు చెందిన లోక్‌సత్తా పార్టీ ప్రెసిడెంట్ బొద్దాన గంగుల యాదవ్ పాల్గొన్నారు.



## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**బొబ్బిలి :** తుఫాను వలన రంగుమారిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. మరియు వీరికి కనీస మద్దతు ధర ప్రకటించాలని, సాధారణ రకమునకు 1 క్వింటాలుకి 1,250 రూపాయిలు, సూపర్ ఫైన్‌రకమునకు 1 క్వింటాలుకు 1,350 రూపాయలు ధరలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు విరివిగా తెరవాలి అన్నారు. ఆలస్యం చేస్తే కష్టించిపండించే రైతులు దళారులు బారినపడి చాలా నష్టపోతారని అన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రైతులను ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు గంగరాజు, భాస్కరరావు, లక్ష్మిలు డిమాండ్ చేశారు. ◆

## కృష్ణా పశ్చిమగోదావరి జిల్లాల్లో జేపీ


















RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



మెదక్ జిల్లా హత్నూర్ గ్రామంలో పండిన పంటను కోయడానికి కూలీలు లేక తగలబెట్టుకున్న రైతును పరామర్శించి, పొలాన్ని పరిశీలిస్తున్న లోక్‌సత్తా నాయకులు

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad